సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
శనివారం, 21.02.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 121
పేజీలు: 12 వెల: రూ. 5


## టోల్‌ప్లాజాల్లో క్యాష్‌కు గుడ్‌బై



- ఏప్రిల్ 1నుంచి డిజిటల్ మాత్రమే!
- ఫాస్టాగ్-యూపీఐతోనే టోల్ చెల్లింపులు
- రద్దీ తగ్గింపు, పారదర్శకత లక్ష్యంగా నిర్ణయం
- చిల్లర కోసం ఎదురుచూపులు ముగిసినట్టే
- డిజిటల్ చెల్లింపులతో ఇంధన ఆదా, వాహనదారులకు లాభం
- అన్ని రాష్ట్రాలకు కేంద్ర రవాణా శాఖ ఆదేశాలు

10

## ఏఐతో కొత్త భవిష్యత్తు

ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

03

- టాలెంట్, టెక్నాలజీతో గ్లోబల్ హబ్ లక్ష్యం
- టీ-ఫైబర్‌తో ప్రతి గ్రామానికి ఇంటర్నెట్..
- ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగం.. పారదర్శకత, లాస్ట్ మైల్ కనెక్టివిటీకి బలం



ఏఐలో తెలంగాణ దూసుకెళ్తుంది

# కిస్సా కుర్చీకా?

- తెలంగాణలో ఖాళీ కానున్న రెండు రాజ్యసభ స్థానాలు..
- కాంగ్రెస్ లో తీవ్రమైన పోటీ.. రేసులో ఉన్నది వీరే..!
- టికెట్ ఆశిస్తున్న సీనియర్లు, టికెట్ త్యాగం చేసిన వారు











## తెలంగాణలో రాజ్యసభ రేసు

### కాంగ్రెస్ పెద్దల మధ్య 'గట్టి' పోటీ!



**ముద్ర, డెస్క్:**
తెలంగాణ నుంచి ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల కోసం అధికార కాంగ్రెస్ పార్టీలో పోటీ తీవ్రంగా మారింది. అసెంబ్లీలో ఉన్న సంఖ్యా బలం కారణంగా ఈ 2 సీట్లు కాంగ్రెస్ ఖాతాలో పడటం ఖాయమనే నేపథ్యంలో ఆ స్థానాలను దక్కించుకోవడానికి పార్టీ సీనియర్ నేతలు, ఆశావహులు లాబీయింగ్ ప్రారంభించారు.
ఏప్రిల్ 9న ప్రస్తుత రాజ్యసభ సభ్యులు అభిషేక్ మను సింఘ్వి, సురేష్ రెడ్డి పదవీకాలం ముగియనుంది. జాతీయ స్థాయి నాయకుడైన సింఘ్వికి మరోసారి అవకాశం ఇవ్వాలనే సంకేతాలు ఉన్నట్లు సమాచారం. దీంతో రెండో సీటు కోసం రాష్ట్ర నేతల మధ్య పోటీ మరింత వేడెక్కింది.
ఈ సీటు కోసం కె. కేశవరావు, వి. హనుమంతరావు, ఇరవత్రి అనిల్, టి. వెంకట్రామి రెడ్డి వంటి నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీకి దీర్ఘకాలంగా సేవలందించిన సీనియర్లు, అలాగే గత ఎన్నికల్లో టికెట్ త్యాగం చేసిన నాయకులు తమకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు.
తెలంగాణ అసెంబ్లీలో ఒక రాజ్యసభ సీటు గెలవడానికి సుమారు 40 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. కాంగ్రెస్‌కు 64 మంది ఎమ్మెల్యేలు ఉండటంతో పాటు ఇతరుల మద్దతు కూడా ఉండే అవకాశంతో రెండు స్థానాలు గెలుచుకోవడం సులభమని అంచనా. అయితే అభ్యర్థుల మిగతా 02లో



## మత్స్యావతారంలో నృసింహుడు

తిరువీధుల్లో భక్తి తరంగం.. సాయంత్రం శేష వాహన సేవ

- బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి ఊరేగింపు వైభవం
- శేష వాహన సేవ.. ఆధ్యాత్మిక కాంతుల వెలుగు
- యాదగిరిగుట్టలో మత్స్యావతార దర్శనం.. భక్తుల సందడి

02

వేదమంత్రాల మధ్య ఘనంగా బ్రహ్మోత్సవ వేడుకలు

## విద్యార్థినులకు అస్వస్థత!

మెదక్ జిల్లా రేగోడ్ కేజీబీవీలో ఫుడ్ పాయిజన్

- మధ్యాహ్నం కూరను రాత్రికి వడ్డించడంతో ప్రమాదం
- కడుపునొప్పితో విద్యార్థినుల ఆసుపత్రి బాట
- 25 మందిలో 10 మంది డిశ్చార్జ్
- హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం
- తనిఖీలు లేకపోవడమే కారణమని స్థానికుల విమర్శలు

09



## టీమిండియాకు స్పిన్ పరీక్ష

సూపర్ 8లో ప్రత్యర్థి జట్ల వ్యూహం

- మెన్ ఇన్ బ్లూకు అగ్నిపరీక్ష!
- లీగ్ దశలో బయటపడిన బ్యాటింగ్ పొరపాట్లు
- ప్రతి మ్యాచ్ భారత్ కు కఠినమే

11




## ప్రపంచ టెక్ మ్యాప్‌లో ఏపీ మార్క్

అమరావతి క్వాంటం వ్యాలీ

- కృత్రిమ మేధస్సుపై గ్లోబల్ రౌండ్ టేబుల్‌లో ప్రసంగించిన సీఎం చంద్రబాబు
- అమరావతి క్వాంటం వ్యాలీపై భారీ లక్ష్యాలు
- సావరిన్ ఏఐతో ప్రజలకు లాభాలు
- డీప్ టెక్నాలజీ రంగంలో ఏపీ దూకుడు

10



## అధిష్టానం మాటే ఫైనల్

టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్



03


- రాజ్యసభ సభ్యుల ఎంపికపై రెండ్రోజుల్లో నిర్ణయం
- మార్చి 1న రాహుల్ గాంధీ రాకతో కీలక చర్చలు
- రెండు రాజ్యసభ సీట్లపై కాంగ్రెస్‌కు ఆధిక్యం

## పల్లెల అభివృద్ధికి ₹ 387.53 కోట్లు

15వ ఆర్థిక సంఘం మూడో విడత నిధులు రిలీజ్

- మూడో విడతతో రూ.1034.42 కోట్లకు చేరిన 15వ ఆర్థిక సంఘం ఫండ్స్
- పంచాయతీ ఎన్నికల తర్వాత వేగం పుంజుకున్న నిధుల విడుదల
- పెండింగ్ బిల్లులు, అభివృద్ధి పనులకు నిధుల వినియోగం సూచన
- ఇంకా రూ.2000 కోట్ల బాకీ విడుదల చేయాలని సీతక్క విజ్ఞప్తి

03





## పరిస్థితులు మారాయి.. ఆయుధాలు వీడుదాం

మావోయిస్టులకు మల్లోజుల విజ్ఞప్తి

- మావోయిజం.. విప్లవ పార్టీగా మారలేకపోయింది
- ఎంచుకున్న మార్గంలో వెళ్లకపోవడంతోనే ప్రజల మద్దతు తగ్గింది
- కర్రెగుట్ట ఆపరేషన్ సమయంలో అక్కడ 500 మంది మావోయిస్టులు ఉన్నారు
- ఆపరేషన్ సింధూర్ సమయంలో అక్కడి నుంచి వెళ్లిపోయారు
- మావోయిస్టు పార్టీకి ఎల్‌టీటీఈతో ఎలాంటి సంబంధం లేదు
- గణపతి ఎక్కడున్నారో నాకు తెలియదు
- పెద్దనోట్ల రద్దుతో ఇబ్బందిపడ్డాం

09

అజ్ఞాతంలో ఉన్నవారు జనజీవన స్రవంతిలోకి రండి

1980లో ఉన్న పరిస్థితులు ఇప్పుడు లేవు

## ఏఐ స్టార్టప్ విలేజ్‌కు హైదరాబాద్ అనుకూలం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



- ప్రత్యేక ఏఐ మంత్రిత్వ శాఖ అవసరం
- హైదరాబాద్‌లో ఏఐ స్టార్టప్ విలేజ్‌కు సిద్ధం
- కేంద్రం-రాష్ట్రాల సమన్వయంతో 'ఏఐ వార్ రూమ్'
- జాతీయ ఏఐ రోడ్‌మ్యాప్‌తో ముందుకెళ్లాలి
- ఇండియా ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రధానికి విజ్ఞప్తి
- ఢిల్లీలోని ఏఐ సమ్మిట్ లో రేవంత్ రెడ్డి

**ముద్ర, న్యూఢిల్లీ:**
ప్రస్తుతం యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలంటే కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక ఏఐ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఏఐ సమ్మిట్‌లో సీఎం ప్రసంగించారు. ఏఐ వినియోగం, నియంత్రణ, మిగతా 02లో

## మహాలక్ష్మికి ఆర్థిక చేయూత ఇవ్వండి

బడ్జెట్ లో రూ. 7,777 కోట్లు కోరిన ఆర్టీసీ

09

## అల్లు అర్జున్‌కు బిగ్ రిలీఫ్

సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో ఊరట

12

- ఆధారాల లేమితో పోలీసుల ఛార్జ్ షీట్‌ను రెండోసారి తిరస్కరించిన నాంపల్లి హైకోర్టు
- కీలక సాక్ష్యాలు లేకపోవడంపై కోర్టు ఆగ్రహం
- దర్యాప్తు లోపాలపై తీవ్ర విమర్శలు

## జెండా మోసిన జీవన్ రెడ్డికి దక్కిందేంటి?

కాంగ్రెస్ లో హాట్ టాపిక్ జీవన్ రెడ్డి ఎపిసోడ్

- కాంగ్రెస్ 'మార్పు'లో మరుగున పడుతున్న నిబద్ధత?
- కాంగ్రెస్ పార్టీలో పరిణామాలతో జీవన్ రెడ్డికి తీవ్ర అస్వస్థత
- జగిత్యాలలో బీఆర్ఎస్ నుంచి చేరిన ఎమ్మెల్యేకు పార్టీలో ప్రాధాన్యంపై జీవన్ రెడ్డి మనస్థాపం
- జీవన్ రెడ్డికి తగిన గౌరవమివ్వాలని కోరిన జగ్గారెడ్డి



**ముద్ర, డెస్క్:**
నమ్ముకున్న సిద్ధాంతం కోసం దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండాను భుజాన మోసిన సీనియర్ నేత జీవన్ రెడ్డి, నేడు అదే పార్టీలో జరుగుతున్న పరిణామాలతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. పదవుల కంటే గౌరవానికే ప్రాణమిచ్చే ఈ రాజకీయ భీష్ముడు, ప్రస్తుత వలస రాజకీయాల వేడిలో అస్వస్థతకు గురికావడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.
తెలంగాణ రాజకీయాల్లో 'నైతికత', 'పార్టీ విధేయత' అనే పదాలకు నిలువెత్తు రూపం జీవన్ రెడ్డి. దశాబ్దాల పాటు కాంగ్రెస్ జెండాను భుజాన మోసి, పార్టీ కష్టకాలంలో ఉన్నా, ప్రలోభాలు ఎదురైనా వెనకడుగు వేయని ధీశాలి ఆయన. కానీ, నేడు అదే పార్టీ అధికారంలోకి వచ్చాక, ఆయన పడుతున్న ఆవేదన, తాజాగా ఆయనకు కలిగిన అస్వస్థత రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మిగతా 02లో

## మంత్రి పదవి నా సమస్య కాదు


కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

- బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరినప్పుడు మంత్రి పదవి ఆఫర్ చేశారు
- రెండున్నరేళ్లయినా మాట నిలబెట్టుకోలేదు
- మంత్రి పదవి ఇవ్వలేకపోతే పిలిచి చెప్పేయాల్సింది



బీజేపీ నన్ను గౌరవించింది

03



సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

శనివారం 21.02.2026

www.mudranews.in | @mudranews




## దేశంలో టాప్ 10 మోటార్ సైకిళ్లు




### హీరో స్ప్లెండర్ ప్లస్

ఇండియాలో అత్యధికంగా అమ్ముడయ్యే బైక్, అద్భుతమైన మైలేజ్ (70+ kmpl). తక్కువ మెయింటెనెన్స్ ఖర్చుతో రోజువారీ వాడుకకు బెస్ట్.




## వారంలో జిల్లాస్థాయి అక్రిడిటేషన్ కమిటీలు పూర్తి చేయాలి

### స్పెషల్ కమిషనర్ ప్రియాంక

**ముద్ర, హైదరాబాద్:**
జిల్లాస్థాయి అక్రిడిటేషన్ కమిటీలను వారం రోజుల్లో పూర్తి చేయాలని సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సి.హెచ్. ప్రియాంక డి.పి.ఆర్.ఓలకు ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని స్థానిక ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు.

శుక్రవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ ఆడిటోరియంలో అక్రిడిటేషన్ కార్డుల జారీ విధి విధానాలపై డి.పి.ఆర్.ఓలు, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ, జి.ఓ. నెం. 252, 103లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అధికారులను కోరారు.

ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా, ఫ్రీలాన్స్, వెటరన్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల నమోదు, దరఖాస్తుల పరిశీలన, రిపోర్టుల తయారీ, అప్రూవల్ లిస్టుల సిద్ధం, రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయింపు, కార్డుల డౌన్‌లోడింగ్ వంటి అంశాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

అక్రిడిటేషన్ ప్రక్రియలో ఎలాంటి ఆన్‌లైన్ లేదా ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తినా వెంటనే రాష్ట్ర ప్రధాన కార్యాలయంలోని మీడియా రిలేషన్స్ విభాగంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అవసరమైతే టెక్నికల్ టీమ్‌ను సంప్రదించి, ఎలాంటి తప్పులకు తావు లేకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం రాష్ట్ర, జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయాలని డి.పి.ఆర్.ఓలను కోరారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురైతే స్పెషల్ కమిషనర్ దృష్టికి తేవాలని సూచించారు.

శిక్షణలో రాష్ట్రంలోని 33 జిల్లాల డి.పి.ఆర్.ఓలు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించిన ఆన్‌లైన్ విధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయి సిబ్బంది లేవనెత్తిన సందేహాలను మీడియా రిలేషన్స్ విభాగం అధికారులు డి.ఎస్. జగన్, యామిని, వెబ్‌సైట్ టీమ్ మేనేజర్ నంద, టెక్నీషియన్ సాయిలు నివృత్తి చేశారు.

అర్హత గల జర్నలిస్టులు http://ipr.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాల కోసం 9154170881 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు డి.ఎస్. జగన్, తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు, జాయింట్ డైరెక్టర్లు శ్రీనివాస్, రమణ, మధుసుదన్, వై. వెంకటేశ్వర్లు, హష్మి, రాజారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ యామిని తదితరులు పాల్గొన్నారు.

## ఏఐ స్టార్టప్ విలేజ్‌కు హైదరాబాద్ అనుకూలం

(మొదటి పేజీ తరువాయి)

చట్టపరమైన మార్గదర్శకాలు, జాతీయ భద్రత వంటి అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఏఐ పరిణామాలను నిశితంగా పర్యవేక్షించేందుకు కేంద్రం–రాష్ట్రాల సమన్వయంతో జాతీయ "ఏఐ వార్ రూమ్" ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లో అలాంటి వార్ రూమ్ నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. హైదరాబాద్‌లో ఏఐ వర్సిటీని ఇప్పటికే సకల వసతులతో ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఆరు నెలలకోసారి హైదరాబాద్ వంటి ప్రదేశంలో ఐఏ సదస్సులు జరగాలన్నారు. జీఎస్టీ కౌన్సిల్ తరహాలో ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రధానిని కోరుతున్నానన్నారు. ఏఐ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. హైదరాబాద్ వచ్చి ఏఐ రంగంలో పెట్టుబడులు పెట్టాలని టెక్నాలజీ దిగ్గజాలకు పిలుపునిచ్చారు. మానవ చరిత్రలో అగ్ని, చక్రం, వ్యవసాయం, విద్యుత్, ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఎలా మార్చాయో గుర్తుచేశారు. ఏఐ కూడా అలాంటి విప్లవాత్మక సాంకేతికతేనని, ఇది కేవలం ఇంకొక టెక్నాలజీ కాదని, మానవ పరిణామ క్రమంలో అత్యంత శక్తివంతమైన మలుపని అభివర్ణించారు. ముసుపటి యంత్రాల మాదిరిగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదని, విశ్లేషించగలదని, నిర్ణయాలు తీసుకోగలదని పేర్కొన్నారు. రోబోటిక్స్‌తో కలిసినప్పుడు యంత్రాలు మానసిక మేధస్సుతో పాటు శారీరక సామర్థ్యాన్ని కూడా పొందుతున్నాయని అన్నారు.



**గత తప్పిదాలు చేయవద్దు**

ప్రపంచ ఏఐ పోటీ ఇప్పటికే ప్రారంభమైందని సీఎం చెప్పారు. కొన్ని దేశాలు, కంపెనీలు ముందంజలో ఉన్నాయని వివరించారు. గత పారిశ్రామిక విప్లవాల సమయంలో జరిగిన అవకాశ నష్టాలను గుర్తు చేస్తూ, ఈసారి భారత్ అలాంటి తప్పిదం చేయకూడదని సూచించారు. సేవలు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విజయం సాధించిన భారత్, ప్రపంచ స్థాయి కోర్ టెక్నాలజీ ఉత్పత్తుల్లో కూడా నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. దేశానికి తక్షణ జాతీయ ఏఐ రోడ్‌మ్యాప్ అవసరమని ఆయన నొక్కిచెప్పారు. ఏఐ అభివృద్ధి ప్రతి దశలో సెమీకండక్టర్ చిప్ తయారీ, జీపీయూ సామర్థ్యాలు, డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ వినియోగం, ఏఐ ప్లాట్‌ఫారమ్‌లు, అప్లికేషన్లు భారత్ స్పష్టమైన వ్యూహంతో ముందుకు సాగాలని సూచించారు. ఏఐ విస్తరణ నేపథ్యంలో ఉపాధిపై ఉద్భవిస్తున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ, కొన్ని రంగాల్లో ఉద్యోగ నష్టాలు సంభవించవచ్చని అన్నారు. అయితే సరైన రీ–స్కిల్లింగ్, అప్–స్కిల్లింగ్ చర్యలతో ఏఐతో సృష్టించబడే కొత్త అవకాశాలు మరింత విస్తృతంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. యువతను ఏఐ–ఆధారిత భవిష్యత్తుకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. స్టార్టప్‌లకు మద్దతు కల్పించేందుకు జాతీయ ఏఐ నిధి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే "ఏఐ స్టార్టప్ విలేజ్"ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఏఐ రంగంలో విధానాలు, చట్టాలు, నైతిక ప్రమాణాలకు మార్గనిర్దేశం చేసే అత్యున్నత సంస్థగా ఇండియా ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రిని కోరారు. ఏఐ అభివృద్ధి సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలన, ప్రజా సేవల మెరుగుదల, జాతీయ భద్రతకు తోడ్పడేలా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బాధ్యతాయుతమైన, సమ్మిళిత, భవిష్యత్ దృష్టితో కూడిన ఏఐ వ్యవస్థను నిర్మించేందుకు ప్రపంచ నిపుణులు, సంస్థలు కలిసి పనిచేయాలని ఆయన కోరారు. ఈ మార్పు యుగంలో భారత్ నాయకత్వం వహించాల్సిన సమయం ఇదేనని స్పష్టం చేశారు.

## కిస్సా కుర్చీకా?

(మొదటి పేజీ తరువాయి)

ఎంపికలో సీనియర్లకు ప్రాధాన్యత ఇస్తారా? లేక సామాజిక, రాజకీయ సమీకరణాలను పరిగణనలోకి తీసుకుంటారా? అన్నది స్పష్టత రానుంది. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 26న నోటిఫికేషన్ జారీ కానుంది. నామినేషన్లకు మార్చి 5 చివరి తేదీగా నిర్ణయించారు. మార్చి 16న పోలింగ్ జరగనుండగా, మార్చి 20న ఫలితాలు ప్రకటించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ త్వరలోనే పార్టీ అధిష్టానంతో భేటీ కానున్నారు. ఈ భేటీ అనంతరం అభ్యర్థులపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా మహారాష్ట్ర, తమిళనాడు, బీహార్ సహా పది రాష్ట్రాల్లో రాజ్యసభ ఎన్నికలు జరగనున్నాయి. తెలంగాణలో అయితే కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

## మత్స్యావతారంలో నృసింహుడు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**
శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహస్వామి వారు శుక్రవారం మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయంలో నిత్యారాధనల అనంతరం స్వామివారిని మత్స్యావతారంలో అలంకరించి భక్తుల దర్శనార్ధం తిరువీధులలో ఊరేగింపు నిర్వహించారు. ఈ వేడుకలో ఆలయ ప్రధానార్చకులు, ఉపప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేదపండితులు అర్చక బృందం పారాయణీకులు కార్యనిర్వహణాధికారి జె. భవానీశంకర్, ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఉపకార్యనిర్వహణాధికారిగారు, సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, ఉద్యోగ సిబ్బంది, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీమన్నారాయణుని యొక్క విభవ అవతారములలో అత్యంత ప్రసిద్ధి చెందింది మత్స్యావతారము.

**సాయంకాల కార్యక్రమాలు**

సాయంకాలం శ్రీ స్వామివారిని శేష వాహన శేవలో అలంకరించి తిరుపూడ ప్రధానార్చకులు, ఉపప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, పారాయణీకులు అత్యంత వైభవముగా ఊరేగింపు వేడుక నిర్వహించారు. ఆదిశేషుడు సమస్త శిరస్సుపై మోయుట సర్వలోకాధిపతి అయిన భగవానునికి శయ్యగా మారుట భగవానుడు ఈ లోకంలో నడయాడినప్పుడు పాదుకలుగా, కూర్చున్నప్పుడు ఆసనముగా, వివిధ ప్రక్రియలలో కైంకర్యములను నిర్వహిస్తూ ఆదిశేషుని వాహన సేవ బ్రహ్మోత్సవ ఆదిలోనే నిర్వహిస్తారు.

## జెండా మోసిన జీవన్ రెడ్డికి దక్కిందేంటి?

(మొదటిపేజీ తరువాయి)

జగిత్యాల రాజకీయాల్లో జీవన్ రెడ్డిది ప్రత్యేక ముద్ర. అయితే, బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్ గూటికి చేరడంతో సమీకరణాలు మారిపోయాయి. దశాబ్దాలుగా ఎవరితోనైతే పోరాటం చేశారో, వారికే పార్టీలో పెద్దపీట వేస్తుండటం జీవన్ రెడ్డి వంటి సీనియర్లకు మింగుడుపడటం లేదు.రాజకీయాల్లో గెలుపోటములు సహజం, కానీ సొంత నియోజకవర్గంలో ప్రాధాన్యత కోల్పోవడం ఒక సీనియర్ నేతకు తీరని అవమానం.నాయకుడి కంటే ఎక్కువగా, ఆయనను నమ్ముకున్న కార్యకర్తలు నేడు 'వచ్చిన వారికి ప్రాధాన్యత – ఉన్న వారికి విస్మరణ' ధోరణితో నిరాశలో ఉన్నారు.

**జగ్గారెడ్డి వ్యాఖ్యలు.. పార్టీ అంతర్మథనానికి అద్దం**

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ సంక్షోభం తీవ్రతను తెలియజేస్తున్నాయి. 'పార్టీ గీత దాటని నాయకుడికి అన్యాయం జరగకూడదు' అని ఆయన అనడం, జీవన్ రెడ్డి పట్ల పార్టీలో ఉన్న సానుభూతిని చాటుతోంది. రాజ్యసభ సీట్ల కోసం పోటీ పడుతున్న తరుణంలో, జీవన్ రెడ్డి వంటి మేధావిని, అనుభవజ్ఞుడిని పార్టీ ఎలా వాడుకుంటుంది అనేది ఇప్పుడు హైకమాండ్ ముందున్న పెద్ద ప్రశ్న.

**నైతికతకు పరీక్షా కాలం**

రాజకీయాల్లో వ్యూహాలు ముఖ్యం కావొచ్చు, కానీ విలువలు అంతకంటే ముఖ్యం. సంక్షోభ సమయాల్లో పార్టీని అంటిపెట్టుకున్న వారికి 'రిటైర్మెంట్' వయసులో ఇలాంటి వేదన మిగల్చడం పార్టీ భవిష్యత్తుకు శుభసూచకం కాదు. వలస నాయకులను చేర్చుకోవడంలో చూపే ఉత్సాహం, పాత కాపుల గౌరవాన్ని కాపాడటంలో కూడా చూపాల్సిన అవసరం ఉంది. జీవన్ రెడ్డి అస్వస్థత కేవలం శారీరకమైనది మాత్రమే కాదు, అది మనస్తాపం నుంచి పుట్టిన ఆవేదన. 'జెండా మోసిన వారికి దక్కేది ఇదేనా?' అనే ప్రశ్న సామాన్య కార్యకర్తలో రాకుండా చూడాల్సిన బాధ్యత కాంగ్రెస్ అధిష్ఠానంపై ఉంది. సీనియర్ల అనుభవం, జూనియర్ల వేగం కలిస్తేనే ప్రభుత్వం, పార్టీ సుస్థిరంగా ఉంటాయి. మరి జీవన్ రెడ్డి విషయంలో కాంగ్రెస్



'న్యాయం' చేస్తుందో లేక 'రాజకీయ అవసరాలకే' మొగ్గు చూపుతుందో వేచి చూడాలి.

## టారిఫ్‌లు చట్టవిరుద్ధం

**ముద్ర డెస్క్ :**
టారిఫ్‌ల విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్(Donald Trump)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పలు దేశాలపై ఆయన విధించిన టారిఫ్‌లు చట్టవిరుద్ధమైనవిగా పేర్కొంటూ అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఆయన తన అధికారాలను అతిక్రమించి సుంకాలు విధించారని పేర్కొంది. ట్రంప్ విధించిన సుంకాలను కొట్టివేసిన ఆ దేశ సుప్రీంకోర్టు.. ఆయన ఏకపక్షంగా సుంకాలు విధించడాన్ని తప్పుబట్టింది. అత్యవసర అధికారాలను వినియోగించి అమెరికా వాణిజ్య భాగస్వాములపై సుంకాల విధింపు చట్టవిరుద్ధమని తెలిపింది. టారిఫ్‌ల విషయంలో ట్రంప్‌నకు వ్యతిరేకంగా ఆరుగురు జడ్జిలు, అనుకూలంగా ముగ్గురు జడ్జిలు తీర్పు ఇచ్చారు.



## తెలంగాణలో రేవంత్ రెడ్డి రాజ్యాంగం అమలు



**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**
భారతదేశంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అమలవుతుంటే తెలంగాణలో మాత్రం రేవంత్ రెడ్డి రాజ్యాంగం అమలు చేస్తున్నారని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం యాదగిరిగుట్టలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దౌర్జన్యంతో రేవంత్ రెడ్డి అజెండాతో అనేక మున్సిపాలిటీలో దౌర్జన్యంగా మున్సిపల్ చైర్ పర్సన్ సీట్లను కైవసం చేసుకోవడం జరిగిందన్నారు. కౌన్సిలర్లను డబ్బులకు కొనుగోలు చేయడం లేదంటే బెదిరింపులకు పాల్పడడం లేదా వివిధ మార్గాలను ఎంచుకోవడం చేశారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒంటెద్దు పోకడతో ఇష్టం వచ్చిన నిర్ణయాలు తీసుకుంటు కార్యకర్తలు వాళ్ళ వాళ్ళ పార్టీల అభ్యర్థులను కష్టపడి గెలిపించుకుంటే వాళ్లకి అధికారం లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇకనుంచి ఎన్నికలు పెట్టకుండా మీకు ఇష్టం వచ్చిన వారికి నామినేటెడ్ చేసుకొని ఈ రాజ్యాన్ని ఏలుకోండని సలహా ఇచ్చారు. ఇంకా రెండున్నరేళ్లు మీ ఆటలు సాగుతాయి వచ్చే ప్రభుత్వం మా కేసీఆర్ ప్రభుత్వమే అప్పుడు ప్రజాస్వామ్యం అంటే ఏంటో బి ఆర్ ఎస్ పార్టీ చూపిస్తదన్నారు. ఆమె వెంట బి ఆర్ ఎస్ నాయకులు కర్ర వెంకటయ్య ఉన్నారు.

## ఉగాదికి డీఎస్సీ నోటిఫికేషన్

**ముద్ర, డెస్క్:**
ఏపీలో నిరుద్యోగులకు గుడ్ న్యూస్. మరో డీఎస్సీ నోటిఫికేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఈ మేరకు ఉపాధ్యాయ నియామక ప్రక్రియకు సంబంధించి నోటిఫికేషన్ జారీ కానుంది. ఏటా డీఎస్సీ ఉంటుందని మంత్రి నారా లోకేష్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా కూడా ఆయన కీలక ప్రకటన చేశారు. త్వరలోనే డీఎస్సీ ప్రకటన ఉంటుందని చెప్పుకొచ్చారు. దీంతో ఉగాదినాడు నోటిఫికేషన్ ఉంటుందని అందరూ అంచనా వేస్తున్నారు. తెలుగువారి ప్రతీక ఉగాది. అందుకే ఆరోజు డీఎస్సీ ప్రకటనకు ఏపీ ప్రభుత్వం సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే నిరుద్యోగులకు పండగే.

**ఆ హామీ మేరకు..**

తాము అధికారంలోకి వస్తే డీఎస్సీ నియామక ప్రక్రియ చేపడతామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్టుగానే 16,000కు పైగా ఉపాధ్యాయ నియామక పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. సకాలంలో ఈ ప్రక్రియను పూర్తిచేసి ఉపాధ్యాయులను నియమించారు. అయితే వాటిని నియామకం పూర్తయిన తర్వాత మరో డీఎస్సీ ప్రకటిస్తామని మంత్రి లోకేష్ చెప్పుకొచ్చారు. వెంటనే కార్యాచరణ మొదలుపెట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయుల ఖాళీలను గుర్తించారు. ఖాళీలకు సంబంధించి ఆన్లైన్లో ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ వచ్చారు. ఈ లెక్కన 3600 ఉపాధ్యాయ పోస్టులతో డీఎస్సీ ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

**జాబ్ క్యాలెండర్ సైతం..**

ఇంకోవైపు ఉగాదినాడు జాబ్ క్యాలెండర్ ప్రకటన వస్తుందని కూడా ప్రచారం నడుస్తోంది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగ నియామకాలకు సంబంధించిన వివరాలను.. వాటి భర్తీకి సంబంధించిన షెడ్యూల్.. జాబ్ క్యాలెండర్లో ప్రకటించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడుతున్నట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో దాదాపు 90000 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖలో భారీగా ఖాళీలు ఉన్నట్లు గుర్తించారని ప్రచారం నడుస్తోంది. అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి.. దాని ప్రాప్తికి ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తామని చంద్రబాబు ప్రకటించిన సంగతి తెలిసిందే. అందుకే డీఎస్సీ నోటిఫికేషన్ తో పాటు జాబ్ క్యాలెండర్ విడుదలకు సన్నాహాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. గతంలో జగన్మోహన్ రెడ్డి ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని ప్రకటించి ఇవ్వలేదు. ఇప్పుడు జాబ్ క్యాలెండర్ ప్రకటన ఇచ్చి చిత్తశుద్ధి చాటుకోవాలని చంద్రబాబు నిర్ణయించారు. ఉగాదిన నిరుద్యోగులకు గుడ్ న్యూస్ చెబుతుందన్నమాట.




## రాజ్యసభ నుంచి ఆ మూడు పార్టీలు ఔట్..!

దేశంలో 12 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ బలం ఏటేటా పెరుగుతోంది. అయితే రాజ్యసభలో ఇప్పటికీ బీజేపీకి సొంతంగా పూర్తిస్థాయి బలం లేదు. దీంతో మిత్రపక్షాల మద్దతుతో బిల్లులు పాస్ చేయించుకుంటోంది. అయితే ఈ ఏడాది చివరి నాటికి బీజేపీ పూర్తిస్థాయి బలం సాధించే అవకాశం ఉంది. ఇదే సమయంలో మార్చి 31 నాటికి రాజ్యసభ నుంచి మూడు ప్రాంతీయ పార్టీలు ప్రాతినిధ్యం కోల్పోనున్నాయి. మరో నాలుగైదేళ్లు మళ్లీ అడుగుపెట్టే అవకాశం కూడా లేదు.

**మార్చిలో 37 స్థానాలు ఖాళీ..**

మార్చి 31 వరకు 37 స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి, ఇందులో మహారాష్ట్ర (7), తమిళనాడు (6), బిహార్ (5), పశ్చిమబెంగాల్ (5), ఒడిశా (4), అస్సాం (3), తెలంగాణ–ఛత్తీస్‌గఢ్–హర్యాణ (పోలు 2), హిమాచల్ ప్రదేశ్ (1) రాష్ట్రాలు కీలకం. తెలంగాణలో కాంగ్రెస్ 2, హిమాచల్‌లో 1 సీటు ఆకలింటుంది, మిగతావి ఎన్డీఏకు దక్కే అవకాశం ఉంది.

ప్రతిపక్షాల ప్రాతినిధ్యం సున్నా

ఆర్‌జేడీ, యూబీటీ, ఎన్సీపీ పూర్తిగా రాజ్యసభలో లేకుండా పోతాయి. ఆర్‌జేడీ బిహార్ సీటు, యూబీటీ ప్రియాంక చతుర్వేది, ఎన్సీపీ అజిత్ పవార్‌వర్గ సీటు కోల్పోతాయి. ఉపేంద్రగోస్వామి పదవీ ముగింపు తర్వాత బీజేపీతో సంబంధాలు పునరుద్ధరించుకుంటున్నారు, ఇది మొదటిసారి ప్రధాన విపక్షాలకు 'జీరో ఎంపీలు' స్థితిని తెచ్చిపెడుతుంది.

కాంగ్రెస్ సీనియర్ల భవిష్యత్

నీరజ్ దాంగీ, అభిషేక్ సింఘ్వీ, మల్లికార్జున ఖర్గే, దిగ్విజయ్ సింగ్ పదవీలు ముగుస్తున్నాయి. ఎమ్మెల్యే బలం లేకపోవడంతో మళ్లీ ఎంపిక అసాధ్యం. ఖర్గేకు మరో అవకాశం ఉండవచ్చు. కానీ దాంగీ రాజస్థాన్ లేదా హిమాచల్ అవకాశాలు మాత్రం అనిశ్చితంగా ఉన్నాయి, ఇది వారి రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
21.02.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



దేశంలో టాప్ 10 మోటార్ సైకిళ్లు

Honda Shine 125
స్మూత్ ఇంజిన్, రిఫైన్డ్ పెర్ఫార్మెన్స్ తో మంచి రైడింగ్ అనుభవం. నగర ప్రయాణాలకు కంఫర్ట్ & మైలేజ్ రెండూ అందిస్తుంది.



## రాజ్యసభ సభ్యునిగా అవకాశం ఇవ్వండి

- ఏఐసీసీ చీఫ్ కు చిన్నారెడ్డి వినతి

**ముద్ర, న్యూఢిల్లీ :**

అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాజ్యసభ సభ్యునిగా అవకాశం ఇస్తామని అధిష్టానం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి కోరారు. శుక్రవారం ఢిల్లీకి వెళ్లిన ఆయన ఇందిరా భవన్‌లో ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వనపర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ బీ ఫారంను వెనక్కి ఇవ్వాలని అధిష్టానం ఆదేశించిందన్నారు. ఆ సమయంలో తనను రాజ్యసభ సభ్యునిగా అవకాశం ఇస్తామని అధిష్టానం ఇచ్చిన హామీని చిన్నారెడ్డి ఏఐసీసీ చీఫ్ ఖర్గే దృష్టికి తెచ్చారు. తనకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి... రాష్ట్ర తాజా రాజకీయ పరిస్థితులను ఖర్గేకు వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో సర్పంచ్ 70 శాతం స్థానాలను, మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలను కైవసం చేసుకుని కాంగ్రెస్ పార్టీ ప్రభంజనాన్ని కొనసాగించిందన్న చిన్నారెడ్డి.. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో, ఇతర ఏ ఎన్నికలు వచ్చిన కూడా ఇదే ఉత్సాహంతో ముందుకు సాగుతామని ఖర్గేకు వివరించారు. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు సమష్టిగా చేస్తున్న కృషిని మల్లికార్జున్ ఖర్గే అభినందించారని చిన్నారెడ్డి తెలిపారు.

## మంత్రి పదవి నా సమస్య కాదు

- బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరినప్పుడు మంత్రి పదవి ఆఫర్ చేశారు
- రెండున్నరేళ్లయినా మాట నిలబెట్టుకోలేదు
- మంత్రి పదవి ఇవ్వలేకపోతే పిలిచి చెప్పేయాల్సింది
- బీజేపీ నన్ను గౌరవించింది
- కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

అధికార పార్టీలో ప్రచారం జరుగుతున్నట్టు సీఎంపై తను చేస్తోన్న ఆరోపణలు, ప్రభుత్వ పాలన తీరుపై విమర్శలకు కారణం మంత్రి పదవి కాదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. తన సమస్య అసలు కానే కాదన్నారు. శుక్రవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరినప్పుడు తనకు మంత్రి పదవి ఆఫర్ చేశారని చెప్పారు. ఆ మాటను పార్టీ నిలబెట్టుకుంటుందా లేదా అనేది తర్వాత విషయమన్న రాజగోపాల్ రెడ్డి... పార్టీ అధికారంలోకి వచ్చాక తనను పార్టీలోకి తీసుకు వచ్చిన సునీల్ కనుగోలు, భట్టి విక్రమార్క, మాణిక్ రావు థాక్రే, మహేశ్ కుమార్ గౌడ్ వంటి నేతలు తన పట్ల ప్రవర్తించిన తీరు చాలా అవమానకరంగా ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కేసీ వేణుగోపాల్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి సీటు సాధిస్తే మీకిచ్చిన హామీని నెరవేరుస్తామని మాట ఇచ్చారని చెప్పారు. తనకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీకి, అధిష్టానానికి ఇబ్బందులు ఉండవచ్చు. కానీ వారు తన పట్ల మాట్లాడిన పద్ధతి, ప్రవర్తించిన తీరు మంత్రి పదవి ఇవ్వలేకపోతున్నామనే విషయాన్ని కనీసం పిలిచి చెప్పకపోవడం దుర్మార్గం అని ఆవేదన వ్యక్తం చేశారు.

**బీజేపీలో గౌరవం ఉండేది**

రేవంత్ రెడ్డి ఒంటెద్దు పోకడలు నచ్చక గతంలో తాను బీజేపీకి వెళ్లానని రాజగోపాల్ రెడ్డి చెప్పారు. ఆ పార్టీ నేతలు అక్కడ తనను ఎంతో గౌరవించారన్నారు. తనను పిలిచి నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, స్టేట్‌లో స్టీరింగ్ కమిటీ చైర్మన్ ఇచ్చారన్నారు. అంత గౌరవించాక కూడా కాంగ్రెస్ పార్టీ కన్నతల్లిలాంటిదని అందులోకి తిరిగి ఆహ్వానిస్తున్నారు కదా అని వచ్చానన్నారు. మంత్రి పదవి ఇవ్వకపోయిన పర్వాలేదు కానీ నన్ను అవమానించిన తీరు బాగోలేదన్నారు. మునుగోడు ఉప ఎన్నికలో రాజగోపాల్ రెడ్డి గెలిచి ఉంటే రాష్ట్ర రాజకీయం మరోలా ఉండేదని ఇటీవల సీపీఐ ఎమ్మెల్యే నెల్లికంటి సత్యం కూడా చెప్పారన్నారు. కాంగ్రెస్ అధిష్టానం నా విషయంలో తప్పు చేసినప్పటికీ ఢిల్లీకి ఆహ్వానిస్తే తప్పకుండా వెళ్తానన్నారు.

# తెలంగాణ అవకాశాల గని..

- ఏఐతో కొత్త భవిష్యత్తు
- ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**ముద్ర, న్యూఢిల్లీ :**






తెలంగాణ రాష్ట్రం అపారమైన ప్రతిభకు నిలయంగా మారిందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో పరిశోధనలు, ఆవిష్కరణలు చేయడానికి అవసరమైన శక్తివంతమైన టాలెంట్ పూల్ రాష్ట్రంలో ఉందని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో నిర్వహించిన ప్రతిష్టాత్మక ఏఐ సమ్మిట్‌లో స్వీడన్ వాణిజ్య ప్రతినిధులు, కృత్రిమ మేధ నిపుణులు, పలు దేశాల ప్రభుత్వ ఉన్నతాధికారులను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగం, వాతావరణ స్థితిస్థాపకత వంటి కీలక అంశాలపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న మంత్రి, ఏఐ వల్ల ఏర్పడే సవాళ్లు, అవకాశాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం ముందుచూపుతో చర్యలు చేపడుతోందని తెలిపారు. ఏఐ విస్తృతితో ఉద్యోగ విధానాల్లో గణనీయమైన మార్పులు వస్తాయని పేర్కొంటూ, అందుకు తగిన విధంగా నైపుణ్యాల పెంపుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ప్రతిపాదిత ఏఐ యూనివర్సిటీలు వంటి సంస్థలు యువతను భవిష్యత్ అవసరాలకు సిద్ధం చేస్తాయని తెలిపారు. స్కిల్లింగ్, రీస్కిల్లింగ్ కార్యక్రమాలను ప్రభుత్వం గత రెండేళ్లుగా ప్రాధాన్యతగా కొనసాగిస్తోందన్నారు. ఏఐ పరిశోధన కేంద్రాలు, అప్లికేషన్లు, సేవల ద్వారా కొత్త ఉద్యోగావకాశాలు సృష్టించబడతాయని, యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఏఐ వల్ల యువత, వృత్తి నిపుణులు మరింత సృజనాత్మక పనులు చేయగలుగుతారని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలులో ఏఐ వినియోగం వల్ల పారదర్శకత పెరుగుతుందని, లాస్ట్ మైల్ కనెక్టివిటీ మెరుగుపడుతుందని చెప్పారు. దుర్వినియోగాన్ని అరికట్టడంలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఇందుకు అవసరమైన సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో గ్లోబల్ టెక్ కంపెనీలు ముందుకు రావాలని ఆయన కోరారు. ప్రతి గ్రామానికి ఇంటర్నెట్ కనెక్టివిటీ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ కార్యక్రమాన్ని చేపట్టిందని, టీఫైబర్ ద్వారా గ్రామాలను ప్రపంచంతో అనుసంధానిస్తున్నామని వివరించారు. డిజిటల్ కనెక్టివిటీ పెరిగితే ఏఐ ప్రయోజనాలు ప్రజలందరికీ చేరుతాయన్నారు. ఏఐను విధ్వంసక శక్తిగా కాకుండా గేమ్ ఛేంజర్‌గా చూడాలని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. నైపుణ్యాలను మెరుగుపరచుకుంటూ ఏఐపై నియంత్రణ సాధిస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామంలా ఉందని, కొత్త ఆవిష్కరణలకు రాష్ట్రం ఎల్లప్పుడూ స్వాగతం పలుకుతుందని మంత్రి పేర్కొన్నారు. నిరంతర విద్యుత్తు సరఫరా, స్థిరమైన విధానాలు, అనుకూలమైన ఎకోసిస్టమ్‌తో పెట్టుబడిదారులకు తెలంగాణ ఆకర్షణీయ గమ్యస్థానంగా మారిందని ఆయన స్పష్టం చేశారు. మొత్తంగా, టాలెంట్, టెక్నాలజీ, పాలసీల సమన్వయంతో తెలంగాణను ప్రపంచ ఏఐ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోంది.

## అధిష్టానం మాటే ఫైనల్

- రాజ్యసభ సభ్యుల ఎంపికపై రెండ్రోజుల్లో నిర్ణయం
- మార్చి 1న రాహుల్ గాంధీ రాకతో కీలక చర్చలు
- రెండు రాజ్యసభ సీట్లపై కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆధిక్యం
- జీవన్ రెడ్డి ఆరోగ్యంపై వాకబు
- బీజేపీపై విమర్శలు.. కాళేశ్వరంపై సీబీఐ విచారణ డిమాండ్
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**ముద్ర, నిజామాబాద్ :**



రాజ్యసభ సభ్యుల ఎంపికపై రెండ్రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఇందులో అధిష్టానం నిర్ణయమే శిరోధార్యమని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం నిజామాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. పెద్దల సభకు ఎవరిని పంపాలనే దానిపై హైకమాండ్ స్పష్టమైన నిర్ణయానికి వచ్చిందన్నారు. మార్చి 1న తెలంగాణకు రాహుల్ గాంధీ రాబోతున్నారన్న ఆయన ఆ సమయంలో రాష్ట్ర ముఖ్య నేతలతో ఆయన మాట్లాడారని తెలిపారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపైనా ఆయన స్పందించారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఆస్తి అని అన్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. మంత్రులపై కావాలనే బీజేపీ నేతలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ చేయించాలని అడిగినా కిషన్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు స్వతంత్రంగా పనిచేస్తారు.. బండి సంజయ్ చెప్పినట్లు కాదని కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ మంత్రులు అవినీతి చేస్తున్నారని బండి సంజయ్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు చూసైనా బండి సంజయ్ బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. ఇదిలా ఉంటే అసెంబ్లీలో ఉన్న సంఖ్యా బలంతో కాంగ్రెస్ రెండు రాజ్యసభ స్థానాలు దక్కించుకునే అవకాశాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. బీఆర్ఎస్ నుంచి గెలిచిన పది మంది కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చే అవకాశం ఉండడంతో రెండు స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ఖరారు చేసినట్లు సమాచారం.

## పల్లెల అభివృద్ధికి రూ. 387.53 కోట్లు విడుదల

- 15వ ఆర్థిక సంఘం మూడో విడత నిధులు రిలీజ్
- రూ. 1,034.42 కోట్లకు చేరిన ఫండ్స్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం మరోసారి తీపి కబురు చెప్పింది. శుక్రవారం 15వ ఆర్థిక సంఘం కింద మూడవ విడతలో భాగంగా వారూ.387.53 కోట్లు విడుదల చేసింది. మొదటి విడతలో భాగంగా ఇప్పటికే రూ. 259.36 కోట్లు విడుదల కాగా రెండో విడత కింద రూ. 387 కోట్లు విడుదల చేసింది. తాజాగా మూడో విడత నిధులు రిలీజ్ చేయడంతో దీంతో ఇప్పటి వరకు 1,034.42 కోట్లు విడుదలయ్యాయి. కేంద్రం నుంచి దశల వారీగా విడుదలైన నిధులలో నుంచి తెలంగాణ ఆర్థిక శాఖ గ్రామ పంచాయతీలకు రూ. 256 కోట్లను విడుదల చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

**ఇంకా పెండింగ్ లో రూ.200 కోట్లు**

దాదాపు రెండేళ్ల ఏళ్ల పాటు తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల ఆలస్యం కావడంతో 15వ ఆర్థిక సంఘం కింద కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోయాయి. గతేడాది డిసెంబర్ లో రాష్ట్రంలోని పంచాయతీల్లో కొత్త పాలకవర్గాలు కొలువుదీరడంతో కేంద్రం నుంచి నిధులు విడుదలవుతుండగా వాటిని క్రమంగా రాష్ట్రం పంచాయతీలకు విడుదల చేస్తోంది. కాగా తెలంగాణకు కేంద్రం ఇంక రూ.2 వేల కోట్లు బాకీ ఉంది. గ్రామాల అభివృద్ధి కోసం పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని కేంద్రానికి తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు కేంద్ర విడుదల చేసిన నిధులను గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు, పెండింగ్ బిల్లుల చెల్లింపులకు వెచ్చించాలని ఆదేశించారు.

## నాంపల్లి సీబీఐ కోర్టుకు బాంబు బెదిరింపు

- బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు
- ఫేక్ కాల్‌గా నిర్ధారణ


**ముద్ర, హైదరాబాద్:**

హైదరాబాద్ లోని నాంపల్లి సీబీఐ కోర్టుకు మరోసారి బాంబు బెదిరింపు కలకలం రేపింది. కోర్టులో బాంబు ఉందని మెయిల్ రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేపట్టారు. రెండు రోజుల క్రితం కూడా ఇలాంటి బెదిరింపు రాగా అధికారులు దాన్ని ఫేక్ కాల్‌గా తేల్చారు. తాజాగా మరోసారి ఫోన్ రావడంతో పోలీసులు నిగ్గుతేల్చే పనిలో పడ్డారు.
రెండ్రోజుల క్రితం కూడా ఇదే తరహా బాంబు బెదిరింపు మెయిల్ రాగా ఆ బెదిరింపులకు పాల్పడింది తమిళనాడుకు చెందిన పోలీసులని స్థానిక పోలీసులు గుర్తించారు. కాగా శుక్రవారం వచ్చిన మెయిల్ ను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఆ మెయిల్ ఎవరు పంపారు ? ఎక్కడి నుంచి వచ్చిందని తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

# అమీర్ పేటలో అగ్నిప్రమాదం

- షార్ట్ సర్క్యూట్ తో మైత్రివనం నీలగిరి బ్లాక్‌లో మంటలు
- మంటల్లో చిక్కుకున్న 200 మంది విద్యార్థులు
- సురక్షితంగా బయటికి తీసుకువచ్చిన పోలీసులు

**ముద్ర, హైదరాబాద్ :**




అమీర్‌పేటలోని మైత్రివనం ఏరియాలో శుక్రవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. మైత్రివనం భవనం పక్కనే ఉన్న నీలగిరి బ్లాక్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. చెక్కలకు నిప్పు అంటుకోవడంతో మంటలు, పొగలు వ్యాపించాయి. దీంతో కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లకు చెందిన విద్యార్థులు చిక్కుకుపోయారు. మెట్ల మార్గంలో దట్టమైన పొగ అలుముకోవడంతో వారు కిందకు దిగడానికి వీలులేకుండా పోయింది. బాల్కనీలోకి వెళ్లిన విద్యార్థులు కిందకు దూకడానికి ప్రయత్నించారు. అయితే వెంటనే అక్కడికి చేరుకున్న ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ సీఐ సంజీవ్ వారితో మాట్లాడి ధైర్యం చెప్పారు. సమీపంలో ఉన్న షాపులో నుంచి నిచ్చెన తీసుకొచ్చారు. హోంగార్డ్స్, ప్రజల సాయంతో 80 మంది వరకు విద్యార్థులను సురక్షితంగా కిందకు దించారు. రెస్క్యూ తర్వాత ప్రమాద ఘటపై జూబ్లీహిల్స్ డీసీపీ రమణారెడ్డి మీడియాతో మాట్లాడారు. తమకు సమాచారం అందిన వెంటనే అందర్నీ అప్రమత్తం చేశామన్నారు. ఇన్‌స్టిట్యూట్‌లోని 200 మంది విద్యార్థులను సురక్షితంగా బయటకు పంపించామని చెప్పారు. ఈ భవనంలో 67 అంతస్థులు ఉండగా.. 2, 3 అంతస్థుల్లో పొగ తీవ్రత ఎక్కువగా ఉందన్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం సంభవించిందన్న ఆయన విద్యార్థులందరినీ సురక్షితంగా బయటకు పంపించామని తెలిపారు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయన్నారు.

**ఘటనా స్థలిని సందర్శించిన హైడ్రా కమిషనర్**

అగ్ని ప్రమాదం జరిగిన ఘటనా స్థలిని హైడ్రా కమిషనర్ ఏ వీ రంగనాథ్ సందర్శించి, ప్రమాద కారణాలపై ఆరా తీశారు. క్షణాల్లో హైడ్రా డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. ఫైర్, పోలీసు విభాగాలు సమన్వయంతో పని చేసి ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం లేకుండా కాపాడారన్నారు. ఫైర్, జీహెచ్ఎంసీ, విద్యుత్, పోలీసు విభాగాలతో నెల క్రితం హైడ్రా తనిఖీలు చేసి కొన్ని షాపులను సీజ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఫైర్ సేఫ్టీ చర్యలు తీసుకోడానికి గడువు కావాలంటే నెల రోజులు సమయం ఇచ్చామన్నారు. వరుస ఘటనల నేపథ్యంలో ఫైర్ చట్టాలలో చేర్పులు, మార్పులను చేయాల్సి ఉంది. ఈ మేరకు సంబంధిత శాఖలతో కలిసి ప్రభుత్వానికి నివేదిస్తాం.. నెల తర్వాత మళ్లీ సంబంధిత శాఖలన్నిటితో కలిసి తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం. ఇదే సమయంలో ప్రజలు కూడా ఎవరికి వారు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించేలా అప్రమత్తమవ్వాలని హైడ్రా కమిషనర్ కోరారు. ఒకవేళ అగ్ని ప్రమాదం జరిగితే సురక్షితంగా బయటపడేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా జాగ్రత్త పడాలని కీలక వ్యాఖ్యలు చేశారు.

**ఐటీ కోచింగ్ సెంటర్లకు కేరాఫ్**

అమీర్‌పేటలోని మైత్రివనం ఐటీ కోచింగ్ సెంటర్లకు పెట్టింది పేరు. బీటెక్, ఎంసీఏ లాంటి కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు. మరిన్ని కోర్సులు నేర్చుకోవడం ద్వారా ఉద్యోగావకాశాలను మెరుగపర్చుకోవడం కోసం మైత్రివనంలోని కోచింగ్ సెంటర్లను ఆశ్రయిస్తుంటారు. ఇక్కడ తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే కాకుండా.. దేశంలోని ఇతర రాష్ట్రాలకు చెందిన వారు సైతం శిక్షణ పొందుతుంటారు. నిత్యం యువతతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించడంతో విద్యార్థులతోపాటు సొంత ఊళ్లలోని తల్లిదండ్రులు ఉలిక్కిపడ్డారు. అయితే విద్యార్థులంతా క్షేమంగా బయటకు వచ్చారని తెలియడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. అగ్నిప్రమాదం గురించి సమాచారం అందగానే సనత్‌నగర్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ నాయకుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హైదరాబాద్ నగరంలో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదని ఆయన ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి అగ్నిప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

### ఎల్బీనగర్ చట్నీస్ లో పేలిన ఇడ్లీ స్టీమర్..

ఎల్బీనగర్‌లోని ఆర్కేపురం చట్నీస్ హోటల్‌లో శుక్రవారం మధ్యాహ్నం పేలుడు సంభవించింది. భారీ శబ్దానికి వినియోగదారులు పరుగులు తీశారు. ఈ ఘటనలో ముగ్గురు హోటల్ సిబ్బందికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇడ్లీ స్టీమర్‌లో పేలుడు సంభవించినట్లు తెలుస్తోంది. సమాచారం తెలుసుకున్న ఎల్బీనగర్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అధిక వేడిమి కారణంగానే స్టీమర్ పేలిపోయినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. పోలీసులు, హైడ్రా సిబ్బంది, బాంబు స్క్వాడ్ బృందాలు పేలుడు సంభవించిన కిచెన్‌ను పరిశీలించాయి. ఇడ్లీ స్టీమర్ వేడెక్కడంతోనే పేలుడు సంభవించిందా? ఇంకేమైనా కారణాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
21.02.2026 శనివారం, హైదరాబాద్

## 4 వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ 'ముద్ర' వేయండి

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com



# తెలుగు తప్పిపోతుందేమో!

**ఫిబ్రవరి 21 తెలుగు భాష దినోత్సవం**

మన తెలుగు తప్పి పోతుందేమో !
అని కాస్త బెంగగా
భయంగా ఉంది
అమ్మకు అన్నం పెట్టలేం
పినతల్లికి పట్టుకోక పెడతాం అన్నట్టుగా ఉంది
అమ్మ భాషను ఆదరించలేం
కానీ పరాయిభాష కోసం ప్రాకులాడుతున్నాం కదా

అమ్మ పలుకుల భాష అచ్చులుగా
నాన్న నేర్పిన నడత హల్లులుగా
నేర్పుదాము అని తెగ ప్రయత్నిస్తున్నా
ఎవరూ ఆసక్తి కనబరచరేం ?

చిన్నారుల పలుకుల్లో
దొరుకుతుందేమోనని ఆశపడ్డాను .
Mummy -Daddy అంటూ పరాయి భాష
పళ్ళికిలించింది.
కొత్తజంట అలకల్లో
అచ్చతెలుగు అడుగుజాడ దొరుకుతుందేమో
అని ఆశపడ్డాను, Don't talk to me
మళ్ళీ వెక్కిరించింది.
ఆంగ్ల మాధ్యమ ప్రభావంతో
అమృత తుల్యమైన మన మాతృభాష
అంతరించిపోయేలా ఉంది.

ఎంతలా అంటే
అమ్మమ్మలు, నాన్నమ్మలు
Hi ! Bye! అంటూ మమ్మల్ని పలకరిస్తున్నారు.
అయినా నేను తెలుగు జాడ
కోసం తెగ తిరుగుతున్నాను
ముఖ పుస్తకంలోని కవుల కవనాలలో కపోతం
ఎగురుతుందిలే అని అనుకొనేలోపే
పరభాషా పదాల ప్రవాహంతో రెక్కలు విరిగిన
పక్షిలానే కనిపించింది.

పేదరాసి పెద్దమ్మ కథలు
నిజంగా పేదగా అయ్యాయి
CoComelon stories
కేరింతలు కొడుతున్నాయిగా
బాపు కథల్లోని బుడుగుగాడేమో బూచోడయ్యాడు
Ben10,చోటా భీంలు
భళా అనిపిస్తున్నాయిగా
ఇక భాగోతపుకథలు బావురుమంటుంటే
బుడగ జంగాల కథలు భోరుమంటున్నాయి.

అమ్మభాష అవగాహన లోపంతో
అనవసరం అవుతుంటే
అన్యభాష అందరి సహకారంతో అహంకారంగా
అందలం ఎక్కుతుంది
మరి అమ్మ భాషను
రక్షించేందుకు నువ్వేం అవుతావు?

పరాయి భాషతో దాడి చేసే రాబందు అవుతావో
తెలుగు భాష కోసం నిలిచే హంసవు అవుతావో
నువ్వే తేల్చుకో !

పరసంస్కృతి పాటించే
రాక్ అండ్ రోల్ గద్దవి అవుతావో
మన సంస్కృతి పాటించే కూచిపూడి నెమలి
అవుతావో
ఇహ కాసుకో
లే నిద్రలే ఓ తెలుగుజాతి
పరాయి భాష మోజు లో
పడి కొట్టుకుపోకు
పాఠశాల ప్రాథమికస్థాయి వరకయినా అమ్మ భాష
అవలంబించేలా పోరుకుపో
తల్లి భాష తప్పి పోకుండా ఉండేందుకు
నీవంతుగా కాస్త తపనపడు.
జై తెలుగుజై జై తెలుగు !



**తేరాల. సాధన గౌడ్**

# అన్నదాతకు యాప్ ఉరి!

## సాంకేతికత ముసుగులో సాగును చంపేస్తున్న సర్కార్!

తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం అంటేనే ఒక పోరాటంగా మారిపోయింది. ఆకాశం వైపు చూసి వర్షం కోసం ఎదురుచూడటం రైతుకు అలవాటే కానీ, ఇప్పుడు ఒక బస్తా యూరియా కోసం చేతిలో ఉన్న స్మార్ట్ ఫోన్ వైపు దీనంగా చూడాల్సి రావడం రాష్ట్ర సాగు చరిత్రలోనే అత్యంత దారుణమైన ఘట్టం. పారదర్శకత పేరుతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'యూరియా బుకింగ్ యాప్' ప్రస్తుతం క్షేత్రస్థాయిలో అన్నదాతల పాలిట యమపాశంగా మారింది. పంట తొలి దశలో అత్యంత కీలకమైన యూరియాను పంపిణీ చేయడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న అనాలోచిత విధానాలు సాగు రంగాన్ని కుదేలు చేస్తున్నాయి.

### యాప్‌లో నిల్వలు సున్నా.. రైతు కళ్లలో కన్నీరు

రాష్ట్రవ్యాప్తంగా సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వరి, మక్కజొన్న వంటి పంటలు ఇప్పుడు పూత మరియు ఖాత దశకు చేరుకున్నాయి. కంకి బలంగా రావాలన్నా, గింజ గట్టి పడాలన్నా ఈ సమయంలో నత్రజని (యూరియా) అందించడం తప్పనిసరి. కానీ, రైతులు ఫర్టిలైజర్ షాపుల దగ్గరకు వెళ్తే అధికారులు మరియు డీలర్లు 'యాప్' మంత్రం జపిస్తున్నారు. ప్రభుత్వం యూరియా పంపిణీని యాప్ పరిధిలోకి తీసుకురావడంతో, అందులో స్టాక్ ఉంటేనే బస్తా ఇవ్వాలనే నిబంధన పెట్టారు. అయితే, దురదృష్టవశాత్తు గత కొద్ది రోజులుగా ఈ యాప్‌లలో స్టాక్ నిల్వలు 'జీరో' అని చూపిస్తున్నాయి. గోడౌన్లలో బస్తాలు మూలుగుతున్నా, యాప్‌లో పర్మిషన్ లేదనే సాకుతో రైతులకు ఎరువులు నిరాకరిస్తున్నారు. ఈ జాప్యం వల్ల పంట ఎదుగుదల ఆగిపోయి, దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### డిజిటల్ అక్షరాస్యత లేని రైతుపై సాంకేతిక భారం

తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లోని వేలాది మంది రైతులకు కనీసం స్మార్ట్ ఫోన్ వాడటం కూడా తెలియదు. ఇప్పటికీ సాధారణ ఫోన్లు వాడుతూ, కేవలం ఫోన్ కాల్స్ కే పరిమితమయ్యే అన్నదాతలపై ఈ 'డిజిటల్ బుకింగ్' భారం మోపడం ఎంతవరకు సమంజసం? ప్రభుత్వం తన అసమర్థతను దాచుకోవడానికి సాంకేతికతను ఒక సాకుగా వాడుకుంటోందని విమర్శలు వస్తున్నాయి. ప్రతి రైతు దగ్గర స్మార్ట్ ఫోన్ ఉంటుందని భావించడం ప్రభుత్వ అవివేకమే అవుతుంది. ఒకవేళ ఫోన్ ఉన్నా, సర్వర్ డౌన్ సమస్యలు, నెట్‌వర్క్ ఇబ్బందులు రైతులకు చుక్కలు చూపిస్తున్నాయి. బుకింగ్ కోసం మీసేవ కేంద్రాల చుట్టూ, ఇంటర్నెట్ సెంటర్ల చుట్టూ తిరగలేక రైతు తన సాగు పనులను వదులుకోవాల్సి వస్తోంది. టెక్నాలజీ అనేది సామాన్యుడికి వెసులుబాటు కల్పించాలి కానీ, అతన్ని ఇబ్బందుల పాలు చేసే సంకెళ్లుగా మారకూడదు.




### రాజకీయ పర్యవసానాలు మరియు ప్రభుత్వానికి హెచ్చరిక

అన్నదాత ఆగ్రహం ఏ ప్రభుత్వానికైనా ప్రమాదకరమే. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎరువుల కోసం రోడ్లపైకి వస్తున్న రైతులను చూస్తుంటే పరిస్థితి చేయి దాటుతోందని అర్థమవుతోంది. ఓట్ల కోసం పథకాలు ప్రకటించడం కాదు, సాగుకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించడమే అసలైన రైతు పక్షపాతమని వారు గుర్తు చేస్తున్నారు. ఈ అసంతృప్తి ఇలాగే కొనసాగితే, రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగలడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. రైతు కన్నీటిపై అధికారం నిలబడదని పాలకులు గుర్తించాలి.

### పెట్టుబడి వృథా.. ఆర్థిక సంక్షోభం వైపు అడుగులు

రైతు ఇప్పటికే విత్తనాలు, దుక్కులు, కూలీలు మరియు పురుగుల మందుల కోసం వేల రూపాయలు అప్పులు చేసి పెట్టుబడి పెట్టాడు. ఈ దశలో యూరియా అందకపోతే ఆ పెట్టుబడి అంతా వృథా అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. చాలా చోట్ల రైతులు ఎరువుల కోసం అర్ధరాత్రి నుండే ఫర్టిలైజర్ షాపుల ముందు పడిగాపులు కాస్తున్నారు. ఎండలో గంటల తరబడి నిల్చున్నా, చివరకు యాప్ సమస్య అని చెప్పి ఖాళీ చేతులతో వెనక్కి పంపడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోంది. ఇది కేవలం ఒక బస్తా ఎరువు సమస్య కాదు, ఒక కుటుంబం యొక్క జీవనాధార సమస్య. ప్రభుత్వం ఈ క్లిష్ట పరిస్థితిని గమనించకుండా కేవలం డిజిటల్ లెక్కలకే పరిమితమైతే, అది గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది.



### యాప్ రద్దు - రైతులకు భరోసా! తక్షణ డిమాండ్

ఇప్పటికైనా ప్రభుత్వం మొండివైఖరి వీడాలి. రైతుకు కావాల్సింది ఎరువు, యాప్ లో అంకెలు కాదు. పాత పద్ధతిలోనే ఫర్టిలైజర్ డీలర్ల వద్ద మరియు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (PACS) ద్వారా ఆధార్ కార్డు ఆధారంగా నేరుగా యూరియా అందేలా చూడాలి. ప్రతి మండలం మరియు జిల్లా కేంద్రంలో నిల్వలను అందుబాటులో ఉంచాలి. కొరత రాకుండా ముందుగానే అంచనా వేసి సరఫరా పెంచాలి. ప్రభుత్వ యంత్రాంగం కేవలం పర్యవేక్షణకు పరిమితమై, రైతు సహకార సంఘాల ద్వారా పంపిణీని వేగవంతం చేయాలి. టెక్నాలజీని రైతు కన్నీళ్లు తుడవడానికి ఉపయోగపడాలి కానీ, కన్నీళ్లు పెట్టించడానికి కాదని ప్రభుత్వం గ్రహించాలి. తెలంగాణ అన్నదాత ఇప్పుడు ఒక చౌరస్తాలో నిలబడి ఉన్నాడు. ఒకవైపు ప్రకృతితో పోరాటం, మరోవైపు ప్రభుత్వం తెచ్చిన కృత్రిమ సాంకేతిక అడ్డంకులు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ 'యాప్' విధానాన్ని రద్దు చేసి, రైతులకు అండగా నిలవాలి. యూరియా కొరతను తీర్చి సాగును రక్షించకపోతే రేపు సామాన్యుడికి మెతుకు కరువయ్యే రోజు వస్తుంది. ఇప్పటికైనా యాప్ విధానాన్ని పక్కన పెట్టి రైతు గుండెల్లో ధైర్యాన్ని నింపేలా ఎరువులను అందుబాటులోకి తీసుకురావాలని యావత్ రైతాంగం డిమాండ్ చేస్తోంది



**వెంక గారి భూమయ్య**
**సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ**
**9848559863**

# సర్‌పై మమత ఒంటరి పోరాటం




**SIR (సర్) ప్రక్రియ బీజేపీకి అనుకూలంగా సాగుతోందన్న ఆరోపణలతో పలు రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఆ రాష్ట్రాల్లో కాస్త ధైర్యంగా ఎదురు నిలుస్తున్నది వెస్ట్ బెంగాల్. సర్ ప్రక్రియ వల్ల ఓటర్లకు అన్యాయం జరుగుతోందని పేర్కొంటూ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పోరాటం ప్రారంభించారు. కేంద్రం ఈ అంశంలో వ్యవహరిస్తున్న తీరుపై ఆమె ఏకంగా యుద్ధ గర్జనకు సిద్ధమయ్యారు.**

కొన్ని దశాబ్దాల పాటు వామపక్షాల పాలనలో కొనసాగిన వెస్ట్ బెంగాల్‌లో మమతా బెనర్జీ కొత్త రాజకీయ చరిత్ర సృష్టించారు. వామపక్షాలే ప్రత్యామ్నాయంగా కనిపించిన ఆ రాష్ట్రంలో, 1984లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి మొదటిసారి గెలిచిన మమతా బెనర్జీ, దాదాపు 15 ఏళ్ల పాటు కాంగ్రెస్‌లోనే కొనసాగుతూ లెఫ్ట్ పార్టీలకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. అయితే తర్వాత రాజకీయ పరిస్థితుల దృష్ట్యా, కాంగ్రెస్ మరియు లెఫ్ట్ పార్టీల వ్యూహాలకు వ్యతిరేకంగా తాను స్వతంత్రంగా నిలవాలనే నిర్ణయంతో తృణమూల్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు.

సింగూరు, నందిగ్రామ్ వంటి ఉద్యమాలతో ప్రజల్లో విశేష ఆదరణ పొందిన మమత, తన పోరాటంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ ఉద్యమాల ఫలితంగా 2011లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టారు.

లెఫ్ట్ భావజాలం నుంచి వచ్చిన నాయకురాలిగా మమత పోరాట ధోరణి ప్రత్యేకంగా నిలిచింది. ఆమె ధైర్యసాహసాలు, ఉద్యమ పంథా ఆమెకు ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయి. త్వరలో వెస్ట్ బెంగాల్‌లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, నాలుగోసారి కూడా ముఖ్యమంత్రిగా గెలవాలని మమత లక్ష్యంగా పెట్టుకున్నారు.

ప్రస్తుతం బెంగాల్‌లో కాంగ్రెస్ కంటే బీజేపీ బలంగా నిలుస్తోంది. మమత ప్రభుత్వంపై బీజేపీ తీవ్రమైన విమర్శలు చేస్తోంది. దౌర్జన్యాలు, హింస తప్ప అభివృద్ధి కనిపించడంలేదని ఆరోపిస్తోంది. "దీదీ దాడులు కావాలా... బీజేపీ భరోసా కావాలా?" అంటూ ప్రజల్లో ప్రచారం సాగిస్తోంది. 2021 ఎన్నికల సమయంలో కూడా బీజేపీ భారీ స్థాయిలో బలం పెంచుకుని, మమత పాలనకు ముగింపు పలుకుతామని నినాదించింది. టీఎంసీకి చెందిన పలువురు కీలక నేతలను తమవైపు తిప్పుకున్నా, చివరికి మమతే విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు.

ఈసారి బీజేపీ మరింత దూకుడుగా ముందుకు సాగుతోంది. అదే సమయంలో మమత కూడా కొత్త వ్యూహంతో ప్రతిస్పందిస్తున్నారు. సర్ ప్రక్రియను రాజకీయ ఆయుధంగా మార్చుకుని, బీజేపీపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఓటర్ల జాబితాల నుంచి లక్షల సంఖ్యలో పేర్లు తొలగిస్తున్నారని ఆరోపిస్తూ, ఈ అంశాన్ని సుప్రీంకోర్టు వరకు తీసుకెళ్లారు.


ఇందులో విశేషం ఏమిటంటే, మమత స్వయంగా లాయర్‌గా కోర్టులో వాదించడం. ప్రభుత్వానికి లాయర్లు ఉన్నప్పటికీ, తానే వాదించడం ద్వారా ఈ అంశాన్ని ప్రజల ముందుకు బలంగా తీసుకెళ్లాలని ప్రయత్నించినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చర్య దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఓట్ల తొలగింపులపై సుప్రీంకోర్టు కూడా ఎన్నికల సంఘానికి కొన్ని సూచనలు చేసింది.

ఇప్పటి వరకు ముఖ్యమంత్రిగా ఉన్న మమత స్వయంగా కోర్టుకు వెళ్లడం వెనుక స్పష్టమైన రాజకీయ వ్యూహం కనిపిస్తోంది. ఇతర రాష్ట్రాల్లో సర్‌పై అభ్యంతరాలు ఉన్నప్పటికీ, అంత స్థాయిలో పోరాటం కనిపించడం లేదు. బెంగాల్‌లో మాత్రం దీనిని ప్రధాన అంశంగా తీసుకుని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనే ప్రయత్నం చేస్తున్నారు.

బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నామని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నామని చాటి చెప్పడానికే మమత ఈ దిశగా అడుగులు వేసినట్లు భావిస్తున్నారు. అదే సమయంలో, బీజేపీ విమర్శలకు ఇది సమాధానంగా నిలుస్తోంది. ముఖ్యమంత్రి స్వయంగా కోర్టులో వాదించడం ప్రజల్లో కూడా ప్రభావం చూపుతోంది.

మరోవైపు, బీజేపీ కూడా సర్ ప్రక్రియపై తమ వాదనను బలంగా వినిపిస్తోంది. రాష్ట్రాలవారీగా పరిస్థితులకు అనుగుణంగా సమాధానాలు ఇస్తోంది. అయితే కొన్ని రాష్ట్రాల్లో ఈ విధానంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో, సర్ అంశంపై మమత చేపట్టిన పోరాటం ఆమె రాజకీయ ఇమేజ్‌ను మరింత బలపరిచింది. నాలుగోసారి అధికారంలోకి రావాలన్న లక్ష్యంతో ఆమె ముందుకు సాగుతున్నారు. తదుపరి బెంగాల్ ఎన్నికల వరకు ఈ రాజకీయ సమీకరణాలు ఎలా మారుతాయో, ప్రజలు ఎవరిని విశ్వసిస్తారో చూడాల్సి ఉంది.

**పట్ట. హరిప్రసాద్**
**రచయిత**
**ఫోన్: 8790843009**



# వసంత మాసం వస్తుంది

వసంత మాసం వస్తుంది
విరహాల ముసుగులు తొలగిస్తుంది,
చెమ్మ చేక్కిన నేలపై
పచ్చని చిరునవ్వులు చిందిస్తుంది.


మామిడి పూతలు, పిందెలు,
ఫలాలు ఆశలులేపి నోరూరిస్తాయి,
కోయిల కూయలు
మనసుల తాళాలు తట్టుతుంది.

మల్లె పూల పరిమళం
మౌనంగా మాటలాడుతుంది,
సాయంత్రపు గాలిలో
మనసులను మత్తెక్కిస్తుంది.

ఎండలు పెరిగి నవ్వుతాయి,
చల్లని గాలి పారిపోతుంది,
ఎండిపోయిన ఆశల కొమ్మలపై
కొత్త పూతలు మొలిపిస్తుంది.

పూల తోటల పల్లవాలు
రంగుల కలల్ని నింపుతాయి,
మనసు నిండా ఉల్లాసాన్ని
వసంతం వర్షంలా కురిపిస్తుంది.

జీవితానికే పునర్జన్మనిచ్చేలా,
వసంత మాసం వస్తుంది,
హృదయాల అంచుల్లో
ఆనంద దీపాలు వెలిగిస్తుంది.



**గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్, భాగ్యనగరం.**

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
21.02.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



దేశంలో టాప్ 10 మోటార్ సైకిళ్లు
Bajaj Pulsar 150
స్టైలిష్ లుక్ మరియు పవర్ ఫుల్ ఇంజిన్‌తో యూత్ ఫేవరెట్. స్పోర్టీ ఫీల్ తో పాటు మంచి మైలేజ్ కూడా ఇస్తుంది.





## బడ్జెట్‌లో బీసీలకు రూ.55వేల కోట్లు కేటాయించాలి

- **బీసీ సబ్‌ప్లాన్ అమలు చేయాలంటూ తీన్మార్ మల్లన్న ధర్నా**

**ముద్ర, మల్కాజిగిరి :**

రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.55 వేల కోట్లు కేటాయించి, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు.తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని గన్ పార్క్ వద్ద మెరుపు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. బీసీ సబ్‌ప్లాన్‌ను తక్షణమే అమలు చేసి, బీసీలకు కేటాయించాల్సిన నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆ నిధులను బీసీ వర్గాల అభివృద్ధికే వినియోగించాలన్నారు. రాష్ట్రంలో బీసీ వర్గాలు జనాభాలో అధిక శాతం ఉన్నప్పటికీ, వారికి తగిన న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది బీసీల పట్ల అన్యాయం మాత్రమే కాకుండా వారి హక్కుల ఉల్లంఘన కూడా అని వ్యాఖ్యానించారు. ఈ ధర్నాలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాగోని హరిశంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి లింగాల గంగాధర్, జిల్లా పార్టీ అధ్యక్షుడు పనగట్ల చక్రపాణి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు వికారాబాద్‌కు సీఎం రేవంత్ రెడ్డి రాక

- **ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**



ఏఐసీసీ శిక్షణ తరగతుల ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికారాబాద్‌కు రానున్నారు. అనంతగిరి హరిత రిసార్ట్స్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సంబంధించి భద్రతా, ఇతర ఏర్పాట్లను కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ స్నేహ మెహ్రా పరిశీలించారు. ఇంటెలిజెన్స్, సీఎం సెక్యూరిటీ వింగ్ ఎస్పీలు చటర్జీ, కృష్ణ, డీఎస్పీలతో కలిసి ఎస్ఏపీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేయనున్న హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, వేదిక ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ సుధీర్, అదనపు కలెక్టర్ రాజేశ్వరి, ఆర్డీఓ వాసు చంద్ర, ఫారెస్ట్ అధికారి జ్ఞానేశ్వర్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహా రెడ్డి, ఆర్అండ్బీ అధికారి శ్రీధర్, వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీ నారాయణ, ఆర్టీవో వెంకటరెడ్డి, డిఎంహెచ్ఓ స్వర్ణ కుమారి, విద్యుత్ శాఖ డీఈ రవిప్రసాద్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ్ భాస్కర్, పీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పనుల పురోగతిపై సమీక్ష

**ముద్ర, తాండూర్ :**

పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ రోడ్డుమార్గంలో పట్టణ శివారులో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా పట్టణ శివార్లలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనుల పురోగతిని పరిశీలించామని చెప్పారు. ఇప్పటివరకు దాదాపు మూడు వేలకుపైగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందని చెప్పారు. వాటిలో అనేక ఇళ్లకు గృహప్రవేశాలు కూడా పూర్తయ్యాయని వెల్లడించారు. రాబోయే రెండు నెలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి, ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో అర్హుల జాబితాను సిద్ధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో దోపిడీ

- **ఉప్పల్ కాంగ్రెస్ ఇన్చార్జ్ పరమేశ్వర్ రెడ్డి**

**ముద్ర, కాప్రా :**

రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో విస్తృత స్థాయిలో దోపిడీ జరిగిందని ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ పరమేశ్వర్ రెడ్డి ఆరోపించారు. అభివృద్ధి, సంక్షేమం పేరుతో బీఆర్ఎస్ నాయకులే అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. చిల్కానగర్ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్‌లో గతంలో కార్పొరేటర్‌గా పనిచేసిన వ్యక్తి "బన్నాల పన్ను" పేరుతో భారీ వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. హైకోర్టు కాలనీ సమీపంలోని సుమారు రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేశారన్నారు. ఇలాంటి ఘటనలు మరెన్నో ఉన్నాయని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా పాలన కొనసాగుతోందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న ఆరు హామీల ప్రభావంతో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌కు చెందిన రమణ, చెర్ల బలరాం, కొండ్ర రాములు, మారేపాక సాయిలు, పోలాటి కిష్టయ్య, కూరెళ్ల యాదగిరి, రాంనర్సయ్య, సిహెచ్ ఐలయ్య, మారేపాక నాగయ్య తదితరులు కాంగ్రెస్లో చేరారు.







## ఘనంగా రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీలు ప్రారంభం

- **క్రీడల అభివృద్ధికి భారీ నిధులు : మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి**

**ముద్ర, నారాయణపేట :**

రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి సమగ్ర క్రీడా విధానాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య, క్రీడలు మరియు యువజన సేవల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి తెలిపారు. నారాయణపేట జిల్లా మక్తల్ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సీఎం కప్ రెండో విడత కబడ్డీ పోటీలను మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మక్తల్ మినీ స్టేడియం అభివృద్ధికి రూ.25కోట్లు మంజూరు చేశామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 60 జట్లు పాల్గొనడం అభినందనీయమన్నారు. రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు మక్తల్‌కు అవకాశం కల్పించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తాను చిన్ననాటి నుంచి ఈ మైదానంలో ఆడిన వ్యక్తిగా, ఇక్కడ రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ గర్వకారణమన్నారు. జిల్లా కలెక్టర్ కోరిక మేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలోని మైదానం అభివృద్ధికి మరో రూ.25కోట్లు మంజూరు చేసినట్లు స్పష్టం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో క్రీడలకు రూ.1600 కోట్లు కేటాయించనున్నామని, గచ్చిబౌలిలో రూ.25 కోట్లతో క్రీడా ఆసుపత్రి ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. జాతీయ స్థాయిలో పోటీలకు వెళ్లే క్రీడాకారుల ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారికి రూ.3కోట్ల పారితోషికం అందజేస్తున్నామని వెల్లడించారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రత్యేక క్రీడా విధానం తీసుకువచ్చిందని అన్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో క్రీడా శాఖకు రూ.25వేల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ఒక్కో క్రీడను ఎంపిక చేయగా, నారాయణపేటకు కబడ్డీ ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ మాట్లాడుతూ కబడ్డీకి నాలుగు వేల సంవత్సరాల చరిత్ర ఉందని, దేశానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన క్రీడ ఇదేనన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ విజయ్, మక్తల్ మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస, వైస్ చైర్‌పర్సన్ శైవి రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాధా లక్ష్మారెడ్డి, డిఇఓ గోవిందరాజులు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి వెంకటేష్ శెట్టి, ఆయా జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాల కేటాయింపునకు చర్యలు తీసుకోండి

- **ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన టీజీవో ప్రతినిధులు**

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**



రంగారెడ్డి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న గెజిటెడ్ అధికారులకు పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం ద్వారా ఇళ్ల స్థలాల కేటాయింపుకు అవసరమైన భూమిని మంజూరు చేయాలని జిల్లా టీజీవో ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా జిల్లా టీజీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామారావు, కార్యదర్శి నరేష్ కుమార్ నోరి, ఇతర కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి టీజీవో2026 డైరీ, క్యాలెండర్‌ను అందజేశారు. అనంతరం జిల్లాలోని గెజిటెడ్ అధికారుల గృహ అవసరాలను వివరించి, గృహనిర్మాణ సంఘానికి తగిన భూమి కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులకు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ బకాయిల చెల్లింపులు, ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కూడా ఎమ్మెల్యేను అభ్యర్థించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రతినిధి బృందం కోరింది. ఎమ్మెల్యేను కలిసిన వారిలో శాంతిశ్రీ, సైదమ్మ, జ్యోత్స్న, రాణి, పావని, మసూద్ అలీ, ఇంద్రసేనారెడ్డి, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ అజయ్ వీర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## పర్వతాధిరోహకుడిని అభినందించిన ఎమ్మెల్యే

**ముద్ర, కుత్బుల్లాపూర్ :**

బౌరంపెట్ కు చెందిన యువ పర్వతాధిరోహకుడు పల్పునూరి తులసీరెడ్డిని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అభినందించారు. శుక్రవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి ఈ సంవత్సరం ఏప్రిల్లో చేపట్టనున్న ఎవరెస్ట్ శిఖర అధిరోహణ వివరాలు తెలియజేయగా ఎమ్మెల్యే వివేకానంద అతడిని అభినందించి ఆశీర్వదించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అత్యున్నత శిక్షణ పొందుతూ పర్వతాధిరోహణలో ఎన్నో విజయాలు సాధించిన తులసిరెడ్డి రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించి కుత్బుల్లాపూర్ కు మరింత పేరు తేవాలన్నారు. తులసి రెడ్డికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ట్యాంక్‌బండ్‌పై మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

- **మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్**

**ముద్ర, కాప్రా :**

ఉప్పల్ రామంతపూర్ ప్రాంతంలోని ట్యాంక్‌బండ్‌పై మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర బీజేపీ నాయకులు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం రామంతపూర్ పరిసర ప్రాంతాల్లో భారీ ఊరేగింపు నిర్వహించారు. వివిధ కుల సంఘాల ప్రతినిధులతో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. సమాజానికి విశిష్ట సేవలందించిన మహనీయుల జ్ఞాపకార్థం ట్యాంక్‌బండ్‌పై వారి విగ్రహాలను ఏర్పాటు చేయడం అవసరమన్నారు. స్థానిక ప్రజల భావోద్వేగాలను గౌరవిస్తూ ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ భారీ ర్యాలీలో బీజేపీ నాయకులు రామ్‌ప్రదీప్, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వివిధ కుల సంఘాల ప్రతినిధులు తమ సంఘీభావాన్ని తెలియజేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు.

## జిల్లా ఆసుపత్రిపై ఆకస్మిక తనిఖీ

- **సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు : కలెక్టర్, ఎమ్మెల్యే**

**ముద్ర, తాండూర్:**

వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని మాతాశిశు ఆసుపత్రిని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వైద్య సిబ్బందితో సమావేశమై ఆసుపత్రిలో ఉన్న సమస్యలు, ఎదురవుతున్న ఇబ్బందులు, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై తక్షణమే దృష్టి సారిస్తామన్నారు. లీకేజీ సమస్యలు, డ్రైనేజీ వ్యవస్థలో లోపాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అబ్దుల్ రజాక్, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఆనంద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ వినయ్ కుమార్, మాజీ కౌన్సిలర్ పట్లోళ్ల నర్సింలు, కౌన్సిలర్లు జావిద్, ప్రభాకర్ గౌడ్, బంటు మల్లప్ప, జుబేర్ లాల, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
21.02.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



దేశంలో టాప్ 10 మోటార్ సైకిళ్లు
TVS Apache RTR 160 4V
సెగ్మెంట్‌లో బెస్ట్ పెర్ఫార్మెన్స్, రేసింగ్ DNA ఫీల్. ఫీచర్స్ & కంట్రోల్ లో చాలా అడ్వాన్స్‌డ్.





## మాజీ మంత్రి జీవన్ రెడ్డిని పరామర్శించిన మంత్రి 'అడ్లూరి'

**ముద్ర, కరీంనగర్:**

సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అస్వస్థతకు గురై సికింద్రాబాద్ లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం సికింద్రాబాద్ లోని కిమ్స్ ఆసుపత్రికి వెళ్లి జీవన్ రెడ్డిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆకాంక్షించారు.





# ఆవోపా తపో భవన్ కు భూమిపూజ

**ముద్ర, కరీంనగర్:**

కరీంనగర్ పట్టణ ఆవోపా ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలో నిర్మించనున్న అవోపా తపోభవన్ కు శుక్రవారం ఉదయం భూమి పూజ చేశారు. పట్టణ ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో నిరుపేద ఆర్యవైశ్యులకు ఉపయోగపడే విధంగా దాతల సహకారంతో మూడంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నట్టు పట్టణ ఆవోపా అధ్యక్షుడు నలుమాసు సుదర్శనం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర అవోపా ముఖ్య సలహాదారు గంజి స్వరాజబాబు, ఆర్యవైశ్య వాసవి వృద్ధాశ్రమ వ్యవస్థాపక చైర్మన్ తోట లక్ష్మణరావు, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కన్న కృష్ణ, రాష్ట్ర ఆవోపా ఉపాధ్యక్షులు సామ నారాయణ, పివి రామకృష్ణ, ఆవోపా భవన్ ట్రస్ట్ అధ్యక్షుడు కట్కూరి సుధాకర్, 66వ డివిజన్ కార్పొరేటర్ వంగల పవన్, 57 వ డివిజన్ కార్పొరేటర్ కొలిపాక రమ్య శ్రీనివాస్, పట్టణ అవోపా సలహాదారు ఉప్పుల రామేశం, జిల్లా ఆవోపా ప్రధాన కార్యదర్శి అయిత ఈశ్వర్ ప్రసాద్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నలుమాచు చంద్రశేఖర్, గజవాడ శ్రీనివాస్, కోశాధికారి కట్కూరి చంద్రశేఖర్, అయిత యోగేంద్ర ప్రసాద్, పుల్లూరి రవీందర్, బివి ప్రవీణ్ కుమార్, ముస్త్యాల సతీష్ కుమార్, నలుమాసు శారద, నలుమాచు రాణి తదితరులు పాల్గొన్నారు

**ఆర్యవైశ్య కార్పొరేటర్లకు సన్మానం..**

కరీంనగర్ పట్టణ ఆవోపా అధ్యక్షుడు నలమాసు సుదర్శనం ఆధ్వర్యంలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 66వ డివిజన్ ఆర్యవైశ్య కార్పోరేటర్ వంగల పవన్ ను, 57వ డివిజన్ కార్పొరేటర్ కొలిపాక రమ్య శ్రీనివాసును పట్టణ ఆవోపా పాలకవర్గం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శేష వస్త్రం, పూల మొక్కతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ సమాజ సేవలో తామెప్పుడు ముందుంటామని, కరీంనగర్ పట్టణ ఆవోపా నిర్వహించే కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.



## మే చివరి వరకు రైల్వే వంతెనలు పూర్తి చేస్తాం

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ముద్ర, ఆదిలాబాద్:**

ఆదిలాబాద్ పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెనలు మే నెలాఖరు వరకు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. రెవెన్యూ, మున్సిపల్, సర్వే, పోలీస్ శాఖల అధికారులతో కలిసి ఆయన శుక్రవారం నిర్మాణ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులు జరుగుతున్న సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. వంతెనల నిర్మాణంలో ఇళ్లు, స్థలాలు కోల్పోయే నిర్వాసితులకు పరిహారం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. ఎగువ వంతెనకు ఇరువైపులా 50 అడుగుల మేర రోడ్డు నిర్మాణం కోసం భూసేకరణ చేయాలని, ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో స్రవంతి, డీఎస్పీ జీవన్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి పనుల అవార్డు కాపీలను రైతులకు అందజేయాలి

- జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్

**ముద్ర, జగిత్యాల:**



జాతీయ రహదారి పనుల అవార్డు కాపీలను రైతులకు తక్షణమే అందజేయాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. జగిత్యాల ఆర్డీవో కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి పనులకు సంబంధించిన అవార్డు కాపీలను రైతులకు తక్షణమే అందజేయాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన "భూ భారతి" రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యల దరఖాస్తులను పరిశీలించి, ప్రతి అభ్యర్థనను పరిష్కరించాలని సూచించారు. మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో పాటు, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితమైన వివరాలతో ప్రతి ఓటరు మ్యాప్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి ఇంటి నుంచి స్పష్టమైన, నిర్దిష్టమైన సమాచారం సేకరించేందుకు అన్ని స్థాయిల అధికారుల సమన్వయం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్, తహసీల్దార్లు రామ్మోహన్, వరందన్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## బాసరలో భక్తుల రద్దీ..

- భారీ సంఖ్యలో అక్షరాభ్యాసాలు

**ముద్ర, నిర్మల్:**

బాసర సరస్వతి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. శుక్రవారం శుభ ముహూర్తం కావడంతో చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించడానికి తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తునభక్తులు తరలివచ్చారు. దీంతో సరస్వతి ఆలయం పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. వేకువ జాము నుంచి పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి అమ్మవారి దర్శనం, చిన్నారుల అక్షరాభ్యాసాల కోసం భక్తులు బారులు తీరారు. ఆలయంలో 1042 అక్షరాభ్యాసాలు జరిగినట్లె ఆలయ అధికారులు తెలిపారు. అక్షరాభ్యాసాలు, గదులు, ప్రసాదాల ద్వారా ఆలయానికి రూ.11 లక్షల ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు.



## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- అడిషనల్ డీఎంహెచ్‌వో రాజగోపాల్ రావు

**ముద్ర, కరీంనగర్:**

ప్రభుత్వ ఆస్పత్రులలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ డీఎంహెచ్‌వో రాజగోపాల్ రావు అన్నారు. చిగురుమామిడి మండలంలోని రేకొండ ఆరోగ్య ఉపకేంద్రంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైన ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరాలలో జనరల్ మెడికల్ చెక్ అప్, స్త్రీల సమస్యలు, చిన్న పిల్లల సమస్యలు, చెవి, ముక్కు, గొంతు, ఆర్థోపెటిక్, కంటి, దంత వైద్య నిపుణులు ఉంటారని పేర్కొన్నారు. వైద్య శిబిరంలో రక్త, మూత్ర పరీక్షలతో పాటు గుండెకు సంబంధించిన ఈసీజీ పరీక్షలను ఉచితంగా ఏర్పాటు చేశామన్నారు. రేకొండలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని చెప్పారు. 308 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి సందీప్ రెడ్డి, బస్తీ దవాఖాన వైద్యాధికారి విశాల, సర్పంచ్ అల్లెపు సంపత్, పంచాయతీ కార్యదర్శి అజయ్ కుమార్, సూపర్వైజర్ హేమలత, ఏఎన్ఎంలు ధనలక్ష్మి, స్వరూప, శైలజ, పద్మ, ఆశాలు బండారి సరోజన, దుడ్డెల తిరుమల, పూజ, ప్రియాంక, సుగుణ, సుజాత, లింగవ్వ, సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలలో గెలుపోటములు సహజం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ముద్ర, జగిత్యాల:**



ఆటలలో గెలుపోటములు సహజమని, గెలిచినా ఓడినా క్రీడాకారులు సమానంగా తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కల్వకోట గ్రామంలో శుక్రవారం ఉమ్మడి మేడిపల్లి మండలం క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు ఆటలు ఆడటం వలన జీవితంలో వచ్చే ఆటుపోట్లను ధైర్యంగా తట్టుకుంటారని అన్నారు. ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్ళడం వలన స్నేహభావం పెరుగుతుందని అన్నారు. వేములవాడ, కోరుట్ల ప్రాంతంలో క్రీడాకారులకు 5 ఎకరాల స్థలం కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి ఎమ్మార్వో మునీందర్, ఎంపీడీవో అంజుమ, ఏఎంసి చైర్మన్ మాదం వినోద్, మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏనుగు రమేష్ రెడ్డి, భీమరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, మేడిపల్లి మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు గుగ్గిల రమేష్, మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, వివిధ గ్రామ సర్పంచులు, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## ఏసీబీ వలలో డాక్యుమెంట్ రైటర్, సబ్ రిజిస్ట్రార్

**ముద్ర, పెద్దపల్లి:**

పెద్దపల్లి జిల్లా మంథని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ అధికారులు డాక్యుమెంట్ రైటర్ తో పాటు మంథని సబ్ రిజిస్ట్రార్ పట్టుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాతో పాటు కరీంనగర్ ఏసీబీ ఇంచార్జ్ గా ఉన్న డీఎస్పీ మధు ఆధ్వర్యంలో అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఓ బాధితుడి వద్ద లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు డాక్యుమెంట్ రైటర్ తో పాటు మంథని సబ్ రిజిస్ట్రార్ పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ అధికారి అవినీతికి పాల్పడితే తమను సంప్రదించాలని తెలిపారు. మంథని మండలం పుట్టపాక గ్రామానికి చెందిన కన్నూరి బాపుకు సంబంధించిన 300 చదరపు గజాల స్థలం రిజిస్ట్రేషన్ చేయడానికి డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని సంప్రదించాడు. బాధితుడు రూ. 16,500లను లంచం ఇస్తుండగా డాక్యుమెంట్ రైటర్ రషీద్ తో పాటు సబ్ రిజిస్ట్రార్ కాసర్ల రాజేందర్ లను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఏ1 గా సబ్ రిజిస్టర్, ఏ2 గా రషీద్ ను కరీంనగర్ లోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

## 24న చలో సెక్రటేరియట్, ధర్నా

- హుజురాబాద్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆర్‌టీసీ జేఏసీ

**ముద్ర, కరీంనగర్:**



ఈనెల 24న చలో సెక్రటేరియట్, ధర్నా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం హుజురాబాద్ డిపో వద్ద ఆర్టీసీ జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, 2021 సంవత్సరం ఉద్యోగుల పేస్కేల్ శాశ్వతంగా 30 శాతం అమలుపరచి, మా లక్ష్మి పథకం కింద ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో యూనియన్లను పునరుద్ధరించాలని, మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, రిటైర్డు ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం కార్మికులు కలిసికట్టుగా చలో సెక్రటేరియట్ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ టీఎస్ సింగ్, కో చైర్మన్ సాధుల కిషోర్, నాయకులు అంబాల రాజు, పీ రాంబాబు, ఏం ఆశోక్, కే వెంకన్న, వీ తిరుపతి, వీరయ్య, కమలాకర్, జీ శ్రీనివాస్, పీ యాదగిరి, వేల్పుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
21.02.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews


దేశంలో టాప్ 10 మోటార్ సైకిళ్లు
Royal Enfield Classic 350
రాయల్ లుక్, హెవీ బిల్డ్ క్వాలిటీతో ప్రీమియం ఫీల్. లాంగ్ రైడ్స్‌కి సూపర్ కంఫర్ట్.





## జీనియస్ విద్యార్థులకు బంగారు పతకాలు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

పట్టణంలోని జీనియస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇంటర్నేషనల్ సైన్స్ ఒలంపియాడ్ పోటీ పరీక్షల్లో బంగారు పతకాలు సాధించారని ప్రిన్సిపల్ బి స్వర్ణలత తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఆమె మాట్లాడుతూ11 డిసెంబర్ 2025న అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇంటర్నేషనల్ సైన్స్ ఒలంపియాడ్ పోటీ పరీక్షల్లో152 మంది విద్యార్థులు పాల్గొనగా ఫలితాలు జనవరి 12 2026 న ప్రకటించడం జరిగిందన్నారు. ఈ ఫలితాలలో పాఠశాలకు చెందిన వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు 24 మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి బంగారు పథకాలు సాధించారని నిర్వాహకులు అందజేసిన బంగారు పథకాలు ప్రశంసా పత్రాలు వారికి అందజేసి అభినందించారు. ఇదే పట్టుదలతో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని అన్నారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



## రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడిని కలిసిన పిట్టల బాలరాజు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

కాంగ్రెస్ రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షులు మిద్దెల జితేందర్ జన్మదినం సందర్భంగా సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి పిట్టల బాలరాజు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాలరాజ్ మాట్లాడుతూ జితేందర్ 2023లో సేవాదళ్ బాధ్యతలు తీసుకొని ఎమ్మెల్యే ఎన్నికల్లో ప్రతి ఒక్క అసెంబ్లీ వారిగా సేవాదళ్ వాలంటీర్స్ నియమించి ఎమ్మెల్యేల గెలుపు కొరకు కృషి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సామల రవీందర్, జనరల్ సెక్రెటరీ షేక్ వాజిద్, బ్లాక్ సేవాదళ్ అధ్యక్షులు లోక్ దాస్ ఉప్పలయ్య, యువజన కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ పుట్ట శివకుమార్, బత్తిని జితేందర్ ప్రకాష్, శ్రీనివాస్, జల్తారాజు రాజు గౌడ్, సురేందర్, రాజశేఖర్, అంకం రాజేష్, మహిళా జిల్లా నాయకురాలు ప్రమీల పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

**మోత్కూర్, ముద్ర న్యూస్:**

మోత్కూరు మండలం పనకబండ గ్రామానికి చెందిన మారుపాక మమత ఇటీవల అనారోగ్యం తో బాధపడుతూ హైద్రాబాద్ లోని రెనోవా హాస్పిటల్లో ఆపరేషన్ చేసుకున్నారు. గ్రామ ఉపసర్పంచ్ రాధారపు మల్లేశం, బీజేపీ తుంగతుర్తి నియోజకవర్గం ఇన్చార్జ్ కడియం రామచంద్రయ్య దృష్టికి తీసుకెళ్లగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కార్యాలయం ద్వారా వారికి రూ.12 వేల ఆర్థిక సాయం కడియం రామచంద్రయ్య చేతులమీదుగా తన నివాసంలో శుక్రవారం బాధితులకి చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిషన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండ శ్రీనివాస్ రెడ్డి. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- **జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించి ప్రజల ప్రాణాలను రక్షించడం కోసం జిల్లాలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాలులో జిల్లాలో రోడ్డు భద్రతా పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో జిల్లాలో జరిగిన ప్రమాదాలకు గల కారణాలు అడిగి తెలుసుకుని వాటిని గుర్తించి ఆ ప్రదేశాల్లో మళ్లీ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సాధించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రధాన రహదారులపై స్పీడ్ గన్స్ ఏర్పాటు చేసి, స్పీడ్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో మైనర్ బాలుర డ్రైవింగ్ ని కట్టడి చేసి డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేయాలని తెలిపారు. జిల్లాలో ఉన్న పాఠశాల బస్సులు అన్ని కండిషన్లు ఉన్నాయా లేవా అని చెక్ చేసి లేని వాటిని చేయాలని సూచించారు. యాక్సిడెంట్ రోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గత సమావేశంలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టారు, జిల్లాలో ఎన్ని బ్లాక్ స్పాట్స్ ఉన్నాయి వాటి పై తీసుకున్న చర్యలు ఏమిటని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రమాద ప్రదేశాలలో సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నేషనల్ హైవే అథారిటీ, పంచాయతీరాజ్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రోడ్ సేఫ్టీ సమావేశాల్లో చర్చించిన అంశాలకు సంబంధించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి తగు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అతివేగంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు, స్పీడ్ గన్స్‌తో తనిఖీలు మద్యం సేవించి వాహనం నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేసి కేసులు నమోదు చేయడం జరుగుతుందని, హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరి ఉల్లంఘనలకు జరిమానాలు విధించి , బ్లాక్ స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశామన్నారు.
ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ,ట్రాఫిక్ ఏసిపి ప్రభాకర్ రెడ్డి, రోడ్డు భవనాల శాఖ అధికారి సరిత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పిహెచ్‌సి ని తనిఖీ చేసిన కలెక్టర్

- **యాదగిరిగుట్ట ప్రాథమిక వైద్యశాలని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం యాదగిరిగుట్ట ప్రాథమిక వైద్యశాలని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో డాక్టర్, మెడికల్ సిబ్బంది అందరూ వచ్చారా లేదా అని హాజరు రిజిస్టర్ పరిశీలించారు. సిబ్బంది అందరూ సమయపాలన పాటించి రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ఈరోజు ఓ.పి కి ఎంత మంది వచ్చారని ఆరా తీసి వారు ఏ సమస్య తో వచ్చారని అడిగి తెలుసుకున్నారు. వచ్చిన పేషంట్లలో ఎక్కువగా ఏ సమస్య పై వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అవసరైన మందులు అన్ని సరిపోను అందుబాటులో ఉన్నాయ అని అడిగి, అన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. గత నెలలో ఆసుపత్రిలో ఎన్ని డెలివరీలు జరిగాయని, అందులో సాధారణ ప్రసవాలు ఎన్ని అయ్యాయని ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల టెస్టులు చేస్తున్నారని గర్భిణీలకు అవగాహన కల్పించి ప్రభుత్వ ఆసుపత్రిలోనే డెలివరీలు చేయించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రిలో ఇటీవల నార్మల్ డెలివరీ జరిగిన గర్భిణి స్త్రీ కి కలెక్టర్ స్వయంగా ఫోన్ చేసి పుట్టిన బిడ్డ ఆరోగ్యం ఎలా ఉంది, ఎంత బరువు లో పుట్టారు, ఆసుపత్రి లో డాక్టర్, సిబ్బంది వైద్య చికిత్సలు అన్ని మంచిగా చేసారా అని అడిగి తెలుసుకున్నారు. అప్పుడు గర్భిణీ ప్రభుత్వ ఆసుపత్రి లో మంచి వైద్య సేవలు అందిస్తున్నారని , ఎలాంటి ఇబ్బందులు కూడా లేవని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలుగా దేవరంగుల కవిత

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

కాంగ్రెస్ పార్టీ భువనగిరి పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలుగా దేవరంగుల కవితను నియమిస్తు మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతా రావు మొగిళ్ళ ప్రకటించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షురాలిగా నియమించినందుకు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మహిళా జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మకి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఇచ్చిన బాధ్యతను నమ్మకంగా మరింత ఉత్సాహంగా పనిచేస్తానన్నారు.

# వైస్ చైర్మన్ గా వెంకన్న ఎన్నిక

**మోత్కూర్ ముద్ర న్యూస్:**



మోత్కూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ గా పల్లెర్ల వెంకన్న ఎన్నిక కావడం ఆర్యవైశ్య సంఘానికి గర్వకారణం అని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు మొగుళ్ళపల్లి సోమయ్య అన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించి వైస్ చైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన పల్లెర్ల వెంకన్న గుప్తా ను మోత్కూర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు మొగుళ్లపల్లి సోమయ్య మాట్లాడుతూ వెంకన్న పేదరికంలో పుట్టి పెరిగి ఎన్నో కష్టాలను అనుభవించి, ఎన్నో సమాజ సేవా కార్యక్రమాల ద్వారా ఈ స్థాయికి వచ్చి, ఒకటో వార్డు కౌన్సిలర్ గా ఘన విజయం సాధించి మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిని స్వీకరించడం గర్వకారణమని, అభినందనీయమన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన వెంకన్న ఇంకా ముందు ముందు ఎన్నో ఉన్నత పదవులు అధిష్టించాలని హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు సభ్యులు వెంకన్నకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోత్కూర్ వర్తక సంఘం అధ్యక్షులు సోమ వెంకటేశ్వర్లు, కిరాణా అసోసియేషన్ అధ్యక్షులు సోమ సంతోష్ కుమార్, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు గుండా రాములు, పట్టణ కోశాధికారి బుక్క విశ్వనాథం, వీరవెల్లి ప్రవీణ్ కుమార్, బుస్స రవి, సోమ నర్సయ్య, బండారు ప్రసాద్,మిట్టపల్లి నాగేష్,మాశెట్టి వెంకన్న , అనంతుల వెంకటేశ్వర్లు, మురారిశెట్టి శ్రీధర్, గుజ్జ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## మంత్రిని కలిసిన గుట్ట చైర్ పర్సన్

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత గౌడ్ శుక్రవారం కలిసి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రితో యాదగిరిగుట్ట మున్సిపాలిటీ అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బీర్ల శంకర్, ఇలియాస్ ఉన్నారు.

## మీసేవ ఆపరేటర్లను యధావిధిగా కొనసాగించాలి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

మండల తహసిల్దార్ కార్యాలయాలలో పనిచేయుచున్న మీసేవ ఆపరేటర్లను యధావిధిగా కొనసాగించాలని గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి గుర్రాల బాలకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పనిచేస్తున్న మీసేవ ఆపరేటర్లను తెలంగాణ ప్రభుత్వం మానవతా దృక్పథంతో యధావిధిగా కొనసాగించాలని కోరారు.

# కేంద్ర బడ్జెట్ తో కార్మికులకు కష్టాలు

- **సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లికార్జున్**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**




202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్ కార్మిక వర్గాలకు తీవ్ర అన్యాయం చేసేదిగా, కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చేదిగా ఉందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లికార్జున్ విమర్శించారు. శుక్రవారం సీఐటీయూ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటి సమావేశం జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూ.53,47,315 కోట్లు బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటికీ కార్మికులకు కేటాయించింది శూన్యం అన్నారు. బడ్జెట్ లో ఉద్యోగ హామీ, అసంఘటిత రంగ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమానికి తగిన కేటాయింపులు చేయలేదన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సరిపడ నిధులు కేటాయించకపోవడం వల్ల గ్రామీణ పేదల జీవనోపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమయంలో పెద్ద కార్పొరేట్ సంస్థలకు పన్ను రాయితీలు, ఉత్పత్తి ప్రోత్సాహకాలు, ప్రత్యేక ప్రోత్సాహక పథకాల ద్వారా వేల కోట్ల రూపాయల సబ్సిడీలు ఇవ్వడం ప్రజావ్యతిరేక చర్యగా అభివర్ణించారు. ప్రజల పన్ను డబ్బుతో కార్పొరేట్లను ప్రోత్సహించడం సరైంది కాదని, ఆ నిధులను ఉపాధి సృష్టి, కనీస వేతనాల పెంపు, పింఛన్లు మరియు సామాజిక భద్రతకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మికుల కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, సమగ్ర సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్ కార్మిక, రైతు, మధ్యతరగతి ప్రజల ఆశలను వమ్ము చేసిందని, దీనికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపడతామని తెలిపారు. తెలంగాణ నుంచి 8 మంది ఎంపీలు ఇద్దరు కేంద్ర మంత్రులు బిజెపి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయించడంలో ఘోరంగా వైఫల్యం చెందారని విమర్శించారు. రైల్వేలు కానీ ఇతర ప్రాజెక్టులో కేటాయింపు లేకపోవడం వల్ల తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందన్నారు. బిజెపికి రాజకీయ స్వార్థం తప్ప తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధి ఇష్టం లేదని విమర్శించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి పాండు, మాయ కృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శులు తుర్కపల్లి సురేందర్, గొరిగే సోములు, పైళ్ల గణపతి రెడ్డి, పొట్ట యాదమ్మ, చెక్క రమేష్, జిల్లా కమిటి సభ్యులు ఆదిమూలం నందీశ్వర్, గంధమల్ల మాతయ్య, బత్తుల దాసు,పోతరాజు జహంగీర్, తూటి వెంకటేష్, శ్రీరాములు, కసగోని లలిత, బుర్రు అనిల్ పాల్గొన్నారు.

దేశంలో టాప్ 10 మోటార్ సైకిళ్లు

Bajaj Platina 100 అత్యుత్తమ మైలేజ్ (70-80 kmpl వరకు) అందించే బైక్. బడ్జెట్ ఫ్రెండ్లీ మరియు డైలీ కమ్యూ కు సరైన ఎంపిక.





# బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ చైర్ పర్సన్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపల్ చైర్ పర్సన్ గా గజవాడ లావణ్య నాగరాజు గుప్తా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చైర్ పర్సన్ తో పాటు మున్సిపల్ నూతన పాలక వర్గం సభ్యులు పదవీ బాధ్యతలు చేపట్టారు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన పాలకవర్గం సభ్యులకు అధికారులు ఘన స్వాగతం పలికారు. వేద పండితులు కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు సహకారంతో రామాయంపేట మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని స్పష్టం చేశారు. 12 వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్లు ప్రవీణ్, రవి నాయక్, నాల బైరం స్వప్న, చౌదరి చరిత, పుట్టి సందీప్, గజవాడ నాగరాజు గుప్తా, జంగంపల్లి శివశంకర్, దేవుని రంజిత్, మద్దెల మాధవి రమేష్, డాకి శ్యామల స్వామి, మున్సిపల్ మేనేజర్ రఘువరన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సేవాలాల్ మార్గంలో నడువాలి

- **ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

బంజారాల ఆరాధ్య దైవమైప సేవాలాల్ మహారాజ్ చూపించిన ఆధ్యాత్మిక మార్గంలో నడువాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సూచించారు. జిల్లాలోని నర్సాపూర్ పట్టణంలో శుక్రవారం సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ దేశ ప్రజలకు సేవాలాల్ మహారాజ్ ఆదర్శప్రాయుడని కొనియాడారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడి వారి ఔన్నత్యానికి పునాదులు వేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.





# అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత

**అల్లాదుర్గం, ముద్ర:**

అల్లాదుర్గం మండలం గడి పెద్దాపూర్ శ్రీ సాయి వెంకటేశ్వర రైస్ మిల్లు లోకి అక్రమంగా తరలిస్తున్న బియ్యం లారీని స్థానిక పోలీసులు పట్టుకున్నారు. బియ్యం స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. సుమారు 42 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వీటి విలువ సుమారు 11 లక్షల 13 వేల 77 రూపాయల వరకు ఉంటుందని పేర్కొన్నారు. బియ్యం తరలింపునకు సంబంధించిన ధ్రువపత్రాలు సరిగా లేనందున అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించి, పూర్తి స్థాయి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని ఎస్సై శంకర్ తెలిపారు.






# బడుల్లో మౌలిక వసతులు కల్పించాలి

- **కలెక్టర్ ప్రావీణ్య**

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

జిల్లాలోని అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పంచాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్ లో శుక్రవారం ఎంఈవోలు, సమగ్ర శిక్ష విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పీఎం శ్రీ పథకం, భవిత సెంటర్లు, కేజీబీవీ సివిల్ వర్క్స్ తో పాటు పలు విద్యా నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. భవిత సెంటర్ల నిర్మాణంలో జహీరాబాద్, మొగుడంపల్లి, కల్హేర్, కొండాపూర్, మనోహర్, మునిపల్లి, ఫుల్కల్, సిర్గాపూర్, కంగ్టి మండలాల్లో పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో చేపడుతున్న మౌలిక సదుపాయాల పనుల ను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. న్యాల్కల్, నాగలిగిద్ద, పుల్కల్, మనూర్, సిర్గాపూర్, వట్ పల్లి ప్రాంతాల్లో కేజీబీవీ భవనాల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

పీఎం శ్రీ పథకం కింద సైన్స్ ల్యాబ్ లు, ఇతర భవన నిర్మాణాల పురోగతిని విద్యా శాఖ అధికారులు కలెక్టర్ కు విచారించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టాయిలెట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. NRGES కింద మంజూరైన టాయిలెట్లను మార్చి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పీఎం శ్రీ బడ్జెట్, UDISE డేటా, ప్రీప్రైమరీ పాఠశాలల అంశాలపై కూడా వివరాలు తెలుసుకున్నారు. సంబంధిత విభాగాలకు డేటా ఖచ్చితత్వం, పనితీరుపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిఈవో వెంకటేశ్వర్లు, ఎంఈఓలు, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.






# వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- **కలెక్టర్ రాహుల్ రాజ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం కుల్చారం మండలం పోతన్ శెట్టిపల్లి జెడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్న పదో తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. సబ్జెక్టులను ఏ విధంగా చదవాలి, మంచి మార్కులు ఎలా స్కోర్ చేయాలో మెళకువలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో శత శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులు బట్టీ పద్ధతికి స్వస్తి పలకాలన్నారు. విషయ సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా ప్రత్యేక తరగతులకు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు టీవీ, ఫోన్, సోషల్ మీడియాలకు దూరంగా ఉండాలన్నారు. ఇష్టంతో చదివి ఉన్నత స్థాయిలో ఉండాలని హితబోధ చేశారు.





# రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ క్రీడలు ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

జిల్లా కేంద్రంలోని అవుట్ డోర్ స్టేడియంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ క్రీడలను అదనపు కలెక్టర్ నగేష్ ప్రారంభించారు. రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి వచ్చిన సుమారు 700 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా యువజన, క్రీడల అధికారి రమేష్ గంగాల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డిఈఓ విజయ, డిఎస్ఓ రాజిరెడ్డి, సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి శోభన్ బాబు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాస్ రావు, మాధవ రెడ్డి, మధు సుధన్, శ్రీకాంత్, మధు, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలు నెరవేరుస్తాం

- **మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చి సమస్యలు పరిష్కరిస్తామని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు తెలిపారు. శుక్రవారం రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో పర్యటించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ నూతన చైర్మన్ గజవాడ నాగరాజు గుప్తాతో కలిసి 5,11,12 వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలల్లో సమస్యలు పరిష్కారిస్తానని పేర్కొన్నారు. ముంపు ప్రాంతాల్లో డ్రైనేజీ నిర్మాణం చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎండాకాలం పూర్తయ్యేలోపు పనులన్నీ చకచగా పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మున్సిపల్ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.



# యూరియా అందుబాటులో ఉంచాలి

**ముద్ర, హైదరాబాద్:**

ప్రభుత్వం యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా నందిపేట మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు ఆందోళన చేశారు. రోజులు గడుస్తున్నా తమకు సమయానికి యూరియా అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత యూరియా కోసం తీవ్రమైన తిప్పలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. యాప్ లో యూరియా బుకింగ్ వ్యవహారం తీవ్రంగా ఇక్కట్లకు గురి చేస్తోందన్నారు. రైతుల రాస్తారోకో విషయాన్ని తెలుసుకున్న పోలీసులు వెంటనే అన్నదాతలను సముదాయించి ఆందోళన విరమింపజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ యాప్ తో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందని తెలిపారు.



# ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి

**ముద్ర, హైదరాబాద్:**

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం మన ఇసుక వాహనం ఆన్ లైన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పోతంగల్ తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలంలోని హంగర్గ మంజీర లో స్థానిక నాయకులతో కలిసి ఆన్‌లైన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ఇసుక అవసరమున్న వినియోగదారులు మన ఇసుక వాహనం యాప్ ద్వారా ఆన్ లైన్ లో బుక్ చేసుకొని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉదయ్ భాస్కర్, ఉప సర్పంచ్ గోపి, కార్యదర్శి గంగారాం, జీపీవో నరేష్, మాజీ సర్పంచ్ గంగారాం, సర్వేయర్ పోషెట్టి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
21.02.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



దేశంలో టాప్ 10 మోటార్ సైకిళ్లు

**Honda SP 125**

సైలెంట్ స్టార్ట్, డిజిటల్ మీటర్ వంటి మోడర్న్ ఫీచర్స్. మంచి మైలేజ్, లైట్ వెయిట్.





# కేజీబీవీలో ఫుడ్ పాయిజన్..

- **25 మంది విద్యార్థినులకు అస్వస్థత**
- **మధ్యాహ్నం కూరను రాత్రికి వడ్డించడంతో ప్రమాదం**
- **10 మంది డిశ్చార్జ్, మిగిలిన వారికి చికిత్స**
- **హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యంపై తల్లిదండ్రుల ఆగ్రహం**

**ముద్ర, హైదరాబాద్:**

పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యం విద్యార్థినుల ప్రాణాల మీదకు తెచ్చింది. మెదక్ జిల్లా రేగోడ్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల (KGBV) లో కలుషిత ఆహారం తిని 25 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్నం వండిన కూరనే రాత్రికి వడ్డించడమే ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.

**అసలేం జరిగిందంటే?**

గురువారం మధ్యాహ్నం విద్యార్థినులకు భోజనంలో గుడ్డు కూర వడ్డించారు. అయితే, అదే కూరను పారేయకుండా, రాత్రికి దానినే పులుసుగా మార్చి మళ్లీ విద్యార్థినులకు వడ్డించినట్లు సమాచారం. ఈ వికృత పోకడ కారణంగా భోజనం చేసిన కొద్దిసేపటికే విద్యార్థినులకు వాంతులు, కడుపునొప్పి మొదలయ్యాయి. అస్వస్థతకు గురైన 25 మంది విద్యార్థినులను పాఠశాల సిబ్బంది వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి మెరుగైన చికిత్స అందుతోంది. బాధితుల్లో ఇప్పటికే 10 మంది కోలుకుని డిశ్చార్జ్ అయ్యారని, మిగిలిన వారు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటనపై విద్యార్థినుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్న హాస్టల్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారుల తనిఖీలు లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు.

# కర్రెగుట్టలో కూంబింగ్ నిలిపివేయాలి

- **సీపీఐ(ఎం) రాష్ట కార్యదర్శి జాన్ వెస్లి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



కర్రెగుట్టలో కొనసాగుతోన్న కూంబింగ్‌ను వెంటనే నిలిపివేయాలని సీపీఐ(ఎం) రాష్ట కార్యదర్శి జాన్ వెస్లీ ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అడవిలో మోహరించిన గ్రేహౌండ్స్, సీఆర్‌పీఎఫ్, కోబ్రా బలగాలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని కోరారు. కేంద్ర హెూంశాఖ విధించిన 40 రోజుల డెడ్‌లైన్ పేరుతో కర్రెగుట్టల అటవీ ప్రాంతంలో రెండు రోజులుగా సాయుధ బలగాలు జరిపిన కాల్పుల్లో ఇప్పటికే ఐదుగురు మావోయిస్టులు మరణించినట్లు ప్రచారం జరుగుతోందని చెప్పారు. ఇంకొంత మంది అగ్రనేతల ప్రాణాలకు హాని కలిగించేలా గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతుండటం ఆందోళనకరమన్నారు. ఆపరేషన్ కాగర్2 పేరుతో కర్రెగుట్ట అటవీ ప్రాంతాన్ని వేలాది మంది సాయుధ బలగాలు చుట్టుముట్టి, మావోయిస్టులను హతమార్చడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. మావోయిస్టులు ఎలాంటి హింసాత్మక ఘటనలకు పాల్పడడం లేదన్నారు. వారు ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు సిద్ధమని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికైనా కేంద్రం హింసాత్మక చర్యలను నిలిపివేయాలని కోరారు. సమస్య పరిష్కారానికి మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వచ్చే విధంగా వారితో చర్చలు జరపాలని సూచించారు. ఈ విషయంలో దేశ వ్యాప్తంగా తమతోపాటు, వివిధ రాజకీయ పార్టీలు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు కేంద్రానికి ఎన్ని విజ్ఞప్తులు చేసినా కేంద్రం ప్రభుత్వం బేఖాతరు చేస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం మొండిగా హింసాత్మక మార్గాన్నే ఎంచుకోవడం సరైంది కాదన్నారు. తక్షణమే ఈ మారణ కాండను నిలిపివేయాలన్నారు. మావోయిస్టులతో చర్చలు జరిపి అటవీ ప్రాంతంలో సాధారణ స్థితిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

# అమెరికాకు యూకే షాక్!

- **ఇరాన్ గొడవల్లోకి లాగొద్దు..**

**ముద్ర న్యూస్:**

వెనెజువెలాలో అధ్యక్షుడిని అపహరించిన అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు ఇరాన్‌పై దృష్టి పెట్టారు. అణ్వస్త్రాలు తయారు చేస్తోందన్న సాకుతో దాడికి సిద్ధమయ్యారు. ఇప్పటికే ఇరాన్ చుట్టూ నావికా దళాలను మోహరించారు.. వాయుసేనను సిద్ధం చేశారు.. మరోవైపు ఇరాన్‌తో అణు చర్యలు జరుపుతున్నారు. ఇవి విఫలం అయితే దాడికి సిద్ధంగా ఉన్నారు. ఇలాంటి తరుణంలో యూకే అమెరికాకు షాక్ ఇచ్చింది. తన కీలక బేస్‌ల వినియోగానికి అనుమతి జారీ చేయకపోవడం ట్రంప్ నకు సవాల్‌గా మారింది. ఫెయిర్‌ఫోర్డ్, డియాగో గార్సియా వంటి స్థావరాల నిషేధం మధ్య ప్రాచ్య యుద్ధ వ్యూహాలను సంక్లిష్టం చేస్తోంది.

**ఇరాన్‌తో అణు చర్చలు..**

అమెరికా ఇరాన్ అణు కార్యక్రమం ఆపమని ఒత్తిడి పెంచుతుంది, చర్చలు విఫలమైతే దాడులు చేస్తామని బెదిరిస్తోంది. ట్రంప్ 10 రోజుల్లో తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు, ఒప్పందం లేకపోతే యూకే భూభాగాల ద్వారా టెహ్రాన్ లక్ష్యంగా చేస్తామని సూచించారు. యుద్ధ నౌకలు, విమానాలు, సైనికుల తరలింపులు ఈ బెదిరింపును ధ్రువీకరిస్తున్నాయి.

**యూకే బేస్‌లపై నిషేధం..**

స్విండన్ సమీపంలోని ఫెయిర్‌ఫోర్డ్ బేస్ నుంచి లాంగ్-రేంజ్ ఆపరేషన్లు, హిందూ మహాసముద్రంలో డియాగో గార్సియా నుంచి దాడులకు అమెరికా అనుమతి కోరగా, కీర్ స్టార్మర్ ప్రభుత్వం తిరస్కరించింది. గతంలో ఈ స్థావరాలను మధ్యప్రాచ్య దాడులకు ఉపయోగించిన నేపథ్యంలో ఈ నిర్ణయం ట్రంప్ అసంతృప్తిని మరింత పెంచింది. డియాగో గార్సియా తిరిగి అప్పగించాలనే యూకే నిర్ణయం ఈ సందర్భంలో మరింత ఉధృతం చేసింది.

**అమెరికా సైనిక సన్నద్ధతలు..**

ఇదిలా ఉంటే ఇరాన్ వైపు భారీ సైనికులను మోహరిస్తోంది అమెరికా. ఏ క్షణంలోనైనా దాడి సూచనలు కనిపిస్తున్నాయని యూఎస్ అధికారులు హెచ్చరిస్తున్నారు. ట్రంప్ ఈ బేస్‌ల ద్వారా దీర్ఘవ్యాప్తి దాడులు చేస్తామని చెప్పడం యూకేతో ఒత్తిడిని పెంచుతోంది. ఇది మధ్యప్రాచ్య ప్రాంతంలో యుద్ధ ఆందోళనలను తీవ్రతరం చేస్తుంది. యూకే నిషేధం అమెరికా వ్యూహాలను మార్చేలా చేస్తుంది, ఇరాన్‌పై ఒత్తిడి పెరిగినా దాడులు సాధ్యమైతే మాత్రమే. ఈ ఘర్షణ అంతర్జాతీయ సంబంధాల్లో కొత్త చర్చలకు దారితీస్తుంది, మధ్యప్రాచ్య స్థిరత్వాన్ని ప్రభావితం చేస్తుంది. ట్రంప్ డెడ్‌లైన్ తర్వాత ఏమి జరుగుతుందో ఆసక్తికరంగా మారింది.

# ఆయుధాలు వీడుదాం..

- **జనజీవన స్రవంతిలోకి రండి**
- **1980లో ఉన్న పరిస్థితులు ఇప్పుడు లేవు**
- **గణపతి ఎక్కడున్నారో నాకు తెలియదు**
- **మాజీ మావోయిస్టు అగ్ర నేత మల్లోజుల**

**ముద్ర, నేషనల్ డెస్క్:**



మారిన పరిస్థితులతోనే సాయుధ పోరాటాన్ని వదిలేయాల్సి వచ్చిందని మాజీ మావోయిస్టు అగ్ర నేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ భూపతి అలియాస్ సోనూ తెలిపారు. శుక్రవారం ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక అంశాలు ప్రస్తావించారు. 1980లో ఉన్న పరిస్థితులు ఇప్పుడు లేవన్నారు. పరిస్థితులను అర్థం చేసుకుని తాము బయటకు వచ్చామని పేర్కొన్నారు. గణపతి ఎక్కడున్నారనే విషయం తనకు తెలియదని చెప్పారు. ఆయన వయస్సు 70 ఏళ్లు దాటినందున అడవుల్లో లేరనేది స్పష్టం అవుతోందన్నారు. ఇంకా అడవులు, నగరాల్లో అజ్ఞాతంలో ఉన్నవారు జనజీవన స్రవంతిలోకి రావాలని విజ్ఞప్తి చేశారు.

**విప్లవ పార్టీగా మారలేకపోయాం**

మావోయిస్టు విప్లవ పార్టీగా మారలేకపోయిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆలోచనలు, ఆయుధాలను పార్టీ నియంత్రించాలని, కానీ ఇక్కడ వ్యతిరేకంగా జరిగిందన్నారు. పార్టీకి బదులు ఆర్మీ (సాయుధ విభాగం) పార్టీని నియంత్రించేలా పరిస్థితులు కొనసాగాయని తెలిపారు. ఇది మావోయిస్టు పార్టీ చేసిన అతిపెద్ద పొరపాటు అన్నారు. తాము ఎంచుకున్న మార్గంలో వెళ్లకపోవడంతోనే మావోయిస్టు పార్టీకి ప్రజల మద్దతు తగ్గిందని అభిప్రాయపడ్డారు. దేశంలో లిబరలైజేషన్ తర్వాత పరిస్థితులు బలంగా మారాయన్నారు. కర్రెగుట్టలను తాము సౌత్ సబ్ జోన్ అని పిలుస్తామన్నారు. కర్రెగుట్ట ఆపరేషన్1 జరుగుతున్న సమయంలో అక్కడ 500 మంది మావోయిస్టులు ఉన్నారని తెలిపారు. ఆ తర్వాత ఆపరేషన్ సిందూర్ వంటి రకరకాల కారణాలతో ఆపరేషన్ ఆగిపోయిందని చెప్పారు. దాంతో మావోయిస్టులంతా అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారన్నారు. మావోయిస్టు పార్టీకి ఎల్‌టీటీఈతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆ సంస్థ నుంచి బయటకు వచ్చిన ఇద్దరికి తమ పార్టీతో సంబంధం ఏర్పడిందన్నారు. 1989లో ల్యాండ్ మైన్, ఇతర పోరాట పద్ధతులపై శిక్షణ పొందారని తెలిపారు.

**2003 నుంచే సాయుధం వీడే ఆలోచనలు..**

2003 నుంచే సాయుధ పోరాటం వీడాల్సిన పరిస్థితులపై ఆలోచనలు మొదలయ్యాయని మల్లోజుల వెల్లడించారు. చివరకు 2023–24 ప్రాంతంలో తుపాకీ వదలాల్సిన సమయం వచ్చిందని స్పష్టమైందన్నారు. ఈ విషయాన్ని గతంలోనే బసవరాజు, గణపతి వంటి నేతలతో చర్చ జరిగిందన్నారు. తన సరెండర్‌పై రకరకాల పుకార్లు వస్తున్నాయన్నారు. బస్వరాజు తర్వాత పార్టీ ప్రధాన కార్యదర్శిగా దేవ్ జీని అధికారికంగా ఎంచుకున్నారా? అనే ప్రశ్నకు బదులిస్తూ ఎంచుకోవడానికి అక్కడ ఎవరూ ఉన్నారని ప్రశ్నించారు. ఇదంతా మీడియా సృష్టేనన్నారు. అక్కడ ఎన్నికలు జరగలేదన్నారు. ఇతర నేతలతో కలిసే పరిస్థితులే అక్కడ లేవన్నారు. తనను జనరల్ సెక్రటరీగా ఎన్నుకున్నట్లు ఇప్పటి వరకు దేవ్ జీ ఎక్కడా ప్రకటించుకోలేదన్నారు. తాను ఎప్పుడు ప్రధాన కార్యదర్శి రేస్‌లో లేనని స్పష్టం చేశారు. పెద్ద నోట్ల రద్దు ప్రభావం మావోయిస్టు పార్టీపై భారీగా పడిందని మల్లోజుల చెప్పారు. రూ. కోట్లు ఉంచుకుని కూడా మార్చుకోలేకపోయామన్నారు. కనీసం రూ.20 కోట్ల వరకు నష్టం జరిగినట్లు తన అంచనా అని చెప్పారు. ఎక్స్ చేంజ్ కోసం డబ్బులు ఇస్తే వాటిని తిరిగి చాలా మంది ఇవ్వలేదని తెలిపారు.



# మహాలక్ష్మికి ఆర్థిక చేయూతనివ్వండి

- **బడ్జెట్ లో రూ. 7,777 కోట్లు కోరిన ఆర్టీసీ**
- **680 కొత్త బస్సుల కోసం రూ. 241.61 కోట్లు ఇవ్వాలని వినతి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

తెలంగాణలో మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహాలక్ష్మి పథకం నిర్వహణ కోసం ఆర్టీసీ... రాష్ట్ర ప్రభుత్వానికి కీలక ప్రతిపాదనలు చేసింది. మహాలక్ష్మి పథకంతో పాటుగా ప్రయాణ సౌకర్యాలు, ఇతర మౌలిక సదుపాయాల విస్తరణకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. ఈ నెలాఖరులో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్ లో రూ.7,777 కోట్లు మహాలక్ష్మి పథకానికి రీయింబర్స్‌మెంట్ కింద కేటాయించాలని కోరింది. అలాగే 202627 ఆర్థిక సంవత్సరంలో 680 కొత్త బస్సులు కొనుగోలు చేయాలని విన్నవించింది. వీటి కోసం రూ.241.37 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపింది. ఈ నిధుల్లో బస్టాండ్‌ల నిర్మాణం, కొత్త డిపోలు, రుణాల చెల్లింపుల కోసం రూ.855 కోట్లు అవసరమని నివేదించింది. మౌలిక వసతులకు సంబంధించి రూ.442.61 కోట్లు,.. ఆయా వర్గాలకు బస్ పాస్‌లకు సంబంధించి రూ.358 కోట్లు కావాలని ప్రతిపాదించింది. రాష్ట్ర రవాణా శాఖ కూడా ప్రతిపాదనల్లో.. 202627 ఆర్థిక సంవత్సరంలో రూ.7,519 కోట్ల ఆదాయాన్ని సమకూరుస్తామని తెలిపింది.

**జూన్ 2 నుంచి స్మార్ట్ కార్డుల జారీ..**

మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి సంబంధించి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. త్వరలోనే రాష్ట్రంలో మహిళలకు మహాలక్ష్మి స్మార్ట్ కార్డులను జారీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు వెల్లడించింది. మహాలక్ష్మి స్మార్ట్ కార్డుల పేరుతో జూన్ 2 నుంచి జారీ చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మహాలక్ష్మి స్మార్ట్ కార్డుల కోసం రూ.75 కోట్లు కేటాయించింది. మహిళలు ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆధార్ కార్డును బస్ కండక్టర్లకు చూపించాల్సి ఉంటుంది. అయితే ఆధార్ కార్డు కాకుండా, మహాలక్ష్మి స్మార్ట్ కార్డులు అందుబాటులోకి వస్తే.. వీటిని చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు అధికారులు. కాగా ఆర్టీసీ ప్రతిపాదనల్లో కొత్త బస్సులతో పాటు, బస్టాండ్‌లు, డిపోలు కూడా ఉన్నాయి. కొత్త బస్సులు అందుబాటులోకి వస్తే మహాలక్ష్మి పథకానికి ఇబ్బందులు తొలిగిపోనున్నాయి. ముఖ్యంగా బస్సుల్లో రద్దీ తగ్గుతుంది. కొత్త డిపోలు, బస్టాండ్‌లు కూడా ఎంతో ఉపయోగంగా ఉంటాయని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా ఆర్టీసీ ప్రతిపాదనలపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందోననే ఆసక్తి నెలకొంది.

# అన్ని కార్పొరేషన్లను అభివృద్ధి చేస్తాం

- **ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తాం**
- **రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**ముద్ర, నిజామాబాద్:**



రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లను అభివృద్ధి చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా కూరగాయల ఉమారాణి ప్రమాణ స్వీకారానికి పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో కలిసి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 రోజుల్లో రాష్ట్రంలోని కార్పొరేషన్ల అభివృద్ధి కోసం, ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించిన ప్రజలు, మున్సిపాలిటీల్లో సైతం ఆదరించారని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ విజన్ 2047 పేరుతో ముందుకు పోతోందన్నారు. 2014 లో రాజ్యసభలో బిల్లును పాస్ చేసుకున్న రోజు తెలంగాణ ప్రజల ఆకాంక్ష ఇదేనని గుర్తు చేశారు. 29వ రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ దేశంలోనే చిన్న రాష్ట్రంగా అవతరించిందన్నారు. కానీ, అభివృద్ధిలో ముందుకు పోతుందన్నారు. నీళ్లు నిధులు నియామకాలు పేరుతో ఏర్పడిన తెలంగాణ అదే లక్ష్యంతో ముందుకు పోతుందని చెప్పారు. ఈ లక్ష్యసాధనలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ కు అన్ని రకాలుగా సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇక్కడున్న కేంద్ర మంత్రులు, ఎంపీలు అందరూ తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరారు. తెలంగాణ ఏర్పాటై పన్నెండేళ్లు అయ్యిందన్నారు. బీజేపీ ప్రభుత్వం ఇప్పటికైనా తెలంగాణ పై శీతకన్ను వదిలిపెట్టాలన్నారు. సోనియాగాంధీ నాయకత్వంలో తెలంగాణ సాధించుకున్నామని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఇచ్చినందుకు మంత్రి సోనియాకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ అమరులు, ఉద్యమకారులకు 250 గజాల స్థలాన్ని ఇస్తామన్నారు. తెలంగాణ మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమం కో ప్రాణాలర్పించిన వారికి నివాళులర్పించారు. వారికి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి మంత్రివర్గంలో సబ్ కమిటీని ఏర్పాటు చేసి, అన్ని విధాలుగా వారిని ఆదుకుంటామన్నారు.

పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేద్దామన్నారు. పట్టణాలు అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు తెస్తామని, అభివృద్ధి చేస్తామని చెప్పారు. నగరంలో డ్రైనేజీలు, సీసీ రోడ్లను అభివృద్ధి చేస్తామని తెలిపారు. పట్టణాల అభివృద్ధికి అన్ని పార్టీలు కలిసి రావాలని కోరారు. ఎన్నికలు ముగిశాయని, ఇక అన్ని పార్టీలు కలిసి పార్టీలకు అతీతంగా నిజామాబాద్ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ . మతాలు, కులాల పేరుతో మాట్లాడటం ఆపేయాలని ఎంపీ అర్వింద్ కు సూచించారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎక్కడా బీజేపీ కనబడడం లేదన్నారు. ఇప్పుడైనా నిజామాబాద్ అభివృద్ధికి తోడ్పడాలని ఎంపీని కోరారు.

# సన్న బియ్యం నాణ్యతలో రాజీ పడొద్దు

- **పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర**
- **బాగ్ లింగంపల్లి గోదాములో తనిఖీ**

**ముద్ర, హైదరాబాద్:**

రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తోన్న సన్న బియ్యం నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీ పడొద్దని పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. పేద ప్రజలు కూడా సంపన్నులతో సమానంగా సన్న బియ్యంతో భోజనం చేయాలన్న మహత్తర సంకల్పంతో ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తోందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో ఉన్న సివిల్ సప్లైస్ గోదామును ఆయన తనిఖీ చేశారు. దాదాపు రెండు గంటల పాటు గోదాములో నిల్వ ఉన్న బియ్యం సంచులను తెరిపించి నాణ్యతను స్వయంగా పరిశీలించారు. బియ్యంలో నూకల శాతం, తేమ శాతం వంటి అంశాలపై అధికారులను ప్రశ్నించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాముకు వచ్చిన బియ్యాన్ని స్వీకరించే దశలోనే క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిల్వలను తిరస్కరించాలని గోదాం ఇన్‌చార్జిలకు సూచించారు. ఈ విషయంలో ఏం మాత్రం రాజీపడినా కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. ప్రజలకు చేరే ప్రతి బియ్యం గింజ నాణ్యమైనదిగా ఉండేలా బాధ్యతగా వ్యవహరించాలన పేర్కొన్నారు. గోదాములో పని చేస్తున్న హమాలీలతో మాట్లాడిన కమిషనర్ వారి పని వాతావరణం, సౌకర్యాల వివరాలు తెలుసుకున్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో హైదరాబాద్ జిల్లా మేనేజర్ కె. సాయి అరుణ్, అదనపు జిల్లా మేనేజర్ దీప్తి, గోదాం ఇన్‌చార్జిలు గోపాలకృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

21.02.2026 శనివారం, హైదరాబాద్

www.mudranews.in | @mudranews






దేశంలో టాప్ 10 మోటార్ సైకిళ్లు

Yamaha MT-15 V2

అగ్రెసివ్ స్ట్రీట్ ఫైటర్ డిజైన్‌తో యూత్ కి బాగా నచ్చే బైక్. పవర్ & హ్యాండ్లింగ్‌లో టాప్ క్లాస్.




## కాంగ్రెస్ ను కలవరపెడుతున్న క్రాస్ ఓటింగ్

- రాజ్యసభ 37 స్థానాలకు మార్చి 16న ఎన్నికలు
- సంఖ్యాబలం పెంపుపై బీజేపీ దృష్టి
- గత అనుభవాలతో కాంగ్రెస్ అప్రమత్తం?
- ఎమ్మెల్యేల ఐక్యతపై ప్రతిపక్షాల దృష్టి
- అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రతిష్టాత్మక పోరు

**ముద్ర డెస్క్ :**

ఏప్రిల్‌లో రాజ్యసభకు చెందిన 10 రాష్ట్రాల్లోని 37 స్థానాలు ఖాళీ కానున్నాయి. ఈ స్థానాల కోసం మార్చి 16న పోలింగ్ నిర్వహించనున్నారు. రాజ్యసభలో సంఖ్యాబలం పెంచుకునే దిశగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) బలమైన స్థితిలో ఉంది. అయితే కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలకు అసలు పరీక్ష మాత్రం తమ ఎమ్మెల్యేల ఐక్యతను కాపాడుకోవడమే. గతంలో పలుచోట్ల క్రాస్ ఓటింగ్ కారణంగా చేతిలో ఉన్న సీట్లు చేజారిన అనుభవం కాంగ్రెస్‌కు ఉంది. అందుకే ఈసారి గెలుపు కంటే కూడా క్రాస్ ఓటింగ్‌ను అడ్డుకోవడం కీలకంగా మారింది.

**ఐక్యతను చాటుకునే వేదిక**

ఈ ఏడాది పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, రాజ్యసభ ఎన్నికలను కాంగ్రెస్ తన అంతర్గత ఐక్యతకు పరీక్షగా చూస్తోంది. ప్రతిపక్ష కూటమి బలాన్ని చూపించేందుకు ఇది మంచి అవకాశంగా భావిస్తోంది. ఎమ్మెల్యేల్ని ఒకేచోట ఉంచి ఓటింగ్‌లో ఏకగ్రీవత సాధించడం కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మక అంశం.

**హర్యానాలో అప్రమత్తంగా ఉండాల్సిందే.**

హర్యానాలో రెండు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. 90 మంది సభ్యుల అసెంబ్లీలో ఒక సీటు బీజేపీకి, మరో సీటు కాంగ్రెస్‌కు దక్కే అవకాశమున్నా రాజకీయ లెక్కలు సూటిగా లేవు. 2022లో క్రాస్ ఓటింగ్ కారణంగా కాంగ్రెస్ అభ్యర్థి అజయ్ మాకన్ ఓడిపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం బీజేపీకి 48 మంది ఎమ్మెల్యేలు, కాంగ్రెస్‌కు 37 మంది ఉన్నారు. ఒక సీటు గెలవాలంటే 31 ఓట్లు అవసరం. అందుకే ఇక్కడ ప్రతి ఓటు కీలకం.

**హిమాచల్‌లో పునరావృతం భయం**

హిమాచల్ ప్రదేశ్లో ఒక రాజ్యసభ స్థానానికి ఎన్నిక జరగనుంది. 68 మంది సభ్యుల అసెంబ్లీలో కాంగ్రెస్‌కు 40 మంది ఉన్నా గత అనుభవం పార్టీని ఆందోళనకు గురి చేస్తున్నది. 2024లో సీనియర్ నేత అభిషేక్ మనూ సింఘ్వీ మెజారిటీ ఉన్నప్పటికీ ఓడిపోవడం పార్టీకి షాక్ ఇచ్చింది. ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. బీజేపీకి ఇక్కడ 28 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

**బిహార్‌లో కూటమి పరీక్ష**

బిహార్లో ఐదు స్థానాలకు ఎన్నిక జరగనుంది. 243 సభ్యుల అసెంబ్లీలో ఒక్కో సీటు గెలవాలంటే 41 ఓట్లు అవసరం. ఎన్డీఏ కూటమికి 202 మంది ఎమ్మెల్యేలు ఉండటంతో నాలుగు సీట్లు దాదాపు ఖాయం. ప్రతిపక్ష కూటమి ఇండియాకి 35 మంది మాత్రమే ఉండటంతో స్వతంత్రంగా సీటు సాధించడం కష్టమే. ఈ నేపథ్యంలో ఐదుగురు ఎమ్మెల్యేలున్న ఆల్ ఇండియా మజ్లిస్‌ఎఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పాత్ర కీలకంగా మారింది. ప్రతిపక్షం ఏకమైతే ఒక సీటు సాధించే అవకాశముంది. మొత్తంగా చూస్తే, ఈ రాజ్యసభ ఎన్నికలు బీజేపీ బలం మరింత పెంచే దిశగా సాగుతున్నప్పటికీ, కాంగ్రెస్‌కు మాత్రం ఎమ్మెల్యేల ఐక్యతను నిలబెట్టుకోవడమే ప్రధాన సవాల్‌గా మారింది. క్రాస్ ఓటింగ్‌ను అడ్డుకోగలిగితేనే ప్రతిపక్షం తమ స్థాయిని కాపాడుకోగలదు.

## ఎంపీ డీకే అరుణకు బీజేపీ కౌన్సిలర్ల సన్మానం

- మున్సిపాలిటీ అభివృద్ధికి సహకారం కోరిన ప్రజాప్రతినిధులు

**ముద్ర, నారాయణపేట :**



నారాయణపేట మున్సిపాలిటీ పీఠాన్ని బిజెపి కైవసం చేసుకోవడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బిజెపి కౌన్సిల్ బృందం శుక్రవారం మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించింది. నారాయణపేట మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు సహకారం అందించాలని ఎంపీని కోరారు. మున్సిపాలిటీలో అత్యధిక కౌన్సిలర్ స్థానాలు బీజేపీ గెలుచుకునేలా కృషి చేసినందుకు ఎంపీ డీకే అరుణకు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు. ప్రణాళికాబద్ధంగా నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొండా శ్వేతా సత్యయాదవ్, వైస్ చైర్మన్ మంజుల రాఘవేంద్ర్ రెడ్డి, కౌన్సిలర్లు కమలాపూర్ ప్రభాకర్, సత్య రఘుపాల్, అంబికా శ్రీనివాస్, కల్పనా రఘు రామయ్య గౌడ్, సౌజన్య, ఎరుకలి రాఘవేంద్ర, నాయకులు చిన్న రఘు తదితరులు ఉన్నారు.

## ఆయేషా మీరా హత్య కేసు..

- సీబీఐ కోర్టు కీలక ఆదేశాలు

**ముద్ర డెస్క్ :**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన ఆయేషా మీరా హత్య కేసులో సీబీఐ కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. వైద్య బృందం సేకరించిన అవశేషాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని ఆదేశించింది. ఫిబ్రవరి 27న తెనాలిలో మతపరమైన ఆచారాలతో అంత్యక్రియలు నిర్వహించాలని, అందుకు అవసరమైన వసతులు, భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. మొత్తం ప్రక్రియను ప్రభుత్వ అధికారుల సమక్షంలో వీడియో రికార్డింగ్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి సీబీఐ దాఖలు చేసిన తుది నివేదికను న్యాయస్థానం తాజాగా ఆమోదించింది. దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు ఆయేషా మీరా మృతదేహానికి రెండోసారి పోస్టుమార్టం నిర్వహించారు. గాంధీ ఆస్పత్రి వైద్యుల అభిప్రాయం తీసుకున్న అనంతరం అవశేషాలను సీబీఐ కోర్టు ముందుంచారు. మరోవైపు తమ కుమార్తె శరీర అవశేషాలను అప్పగించాలని కోరుతూ తల్లిదండ్రులు శంషాద్ బేగం, సయ్యద్ ఇక్బాల్ బాషా సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం తల్లిదండ్రుల విజ్ఞప్తిని అంగీకరించి ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని మహిళల వసతి గృహంలో 2007లో బి.ఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్యకు గురైన సంగతి తెలిసిందే.

## పెండింగ్ సమస్యల పరిష్కారానికి వినతి

**ముద్ర, కుత్బుల్లాపూర్ :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి సీఓఃఎం సలహాదారు (ప్రజా వ్యవహారాలు) వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, పార్కుల అభివృద్ధి, తాగునీటి సరఫరా వంటి సమస్యలను సవివరంగా వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. వేం నరేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించి సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు టి.లక్ష్మీ రెడ్డి, రషీద్, సిద్ధనోళ్ల సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అస్సాంలో కాంగ్రెస్‌కు షాక్ తప్పదా..?

- రాహుల్ మౌనం ఎందుకు..?

**ముద్ర, డెస్క్ :**



రాహుల్ గాంధీ ఏటా రాజకీయ పరిణతి చెందినట్లు కనిపిస్తున్నా వ్యూహాలు అమలు చేయడంలో విఫలం అవుతున్నారు. అందుకే కేంద్రంలో ఎన్డీఏ వరుసగా మూడుసార్లు కేంద్రంలో అధికారం చేపట్టింది. ఇక దేశంలోని పలు రాష్ట్రాల్లో కూడా అధికారం కోల్పోతోంది. ప్రస్తుతం దేశంలో కేవలం మూడు రాష్ట్రాల్లోనే కాంగ్రెస్ సొంతంగా అధికారంలో ఉంది. తమిళనాడు, జమ్మూకశ్మీర్, పంజాబ్‌లో పొత్తుతో అధికారంలో ఉంది. మొన్నటి బిహార్ ఎన్నికల్లో రాహుల్ పాచిక పారలేదు సర్‌ను వ్యతిరేకిస్తూ ఆయన చేపట్టిన ఓటర్ అధికార్ యాత్ర బెడిసి కొట్టింది. జేడీయూపై వ్యతిరేకత ఉన్నా.. రాహుల్ కారణంగానే మరోమారు అధికారంలోకి వచ్చింది. ఓటర్ విభజనలు కాంగ్రెస్‌ను బలహీనపరుస్తున్నాయి. బంగ్లాదేశ్ మూలాల ఓటర్లపై దృష్టి పెట్టిన పాదయాత్రలు హిందూ మద్దతును కోల్పోయి, పార్టీలో నేతలు బీజేపీ వైపు మళ్లడం ప్రారంభించింది.

**బిహార్ పాదయాత్ర విఫలం..**

పూర్వాంచల్ ప్రాంతంలోని మూడు-నలుగు జిల్లాల్లో బంగ్లాదేశ్ మూలాల ఓటర్ల కోసం 16 రోజుల 'ఓటర్ అధికార యాత్ర' నిర్వహించిన రాహుల్, స్థానిక సర్కారుపై వ్యతిరేక ప్రచారం చేశారు. ఇది హిందూ ఓటర్లలో వ్యతిరేకత రేకెత్తించి, కాంగ్రెస్‌తో పాటు మిత్రపక్షాలను కూడా ఓడింపజేసింది. 1950ల నుంచి ఉన్న చొరబాటు సమస్యలు, 1951 ఎన్ఆర్సీ, 1979-85 అస్సాం ఉద్యమాల నేపథ్యంలో ఈ వ్యూహం పార్టీకి రాజకీయ దెబ్బ తీసుకొచ్చింది.

**అస్సాంలోనూ చొరబాటు సమస్యలు..**

అస్సాంలో 1971 తర్వాత బంగ్లాదేశ్ చొరబాటుదారులు ఓటర్లుగా నమోదవుతున్నారు, ఈ వర్గం కాంగ్రెస్‌పై ఆధారపడుతోంది. రాహుల్ ఇక్కడ యాత్ర చేయకుండా రాహుల్‌గాంధీ ఢిల్లీలోనే ఉంటున్నారు. ఆయన మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం. నరావణె రాసినట్లు చెబుతున్న పుస్తకంపై ఉన్న దృష్టి అస్సాంపై పెట్టడం లేదు. ముస్లిం మద్దతు కోసం పోరాడితే హిందూ ఓటర్లు దూరమవుతారనే ఆయన భావన పార్టీకి రెండు వైపులా నష్టం కలిగిస్తోంది.

**అస్సాంలో నేతల మధ్య విభేదాలు..**

రఖీబుల్ హసన్‌కు అస్సాం ఎన్నికల బాధ్యతలు అప్పగించడంతో ఉత్తర అస్సాం హిందూ నేతలకు టికెట్లు ఇవ్వకపోవడం తీవ్ర అసంతృప్తి తెచ్చింది. 2024 ఉప ఎన్నికల్లో పీసీసీ చీఫ్ భూపెన్ బోరా అభ్యర్థిత్వం కోరినా రద్దు చేయబడింది. గౌరవ్ గోగోయ్ పాకిస్తాన్ ప్రశ్నలు, భార్య బ్రిటిష్ మూలాలు ఉండడం, పాక్ చారిటీతో కలిసి పని చేయడం వంటి వివాదాలు పార్టీలో కలహాలను మరింత తీవ్రతరం చేశాయి. ఈ వివాదాలు కాంగ్రెస్‌ను బలహీనపరిచాయి.

**భూపెన్ బోరా బీజేపీలోకి..**

రెండుసార్లు ఎమ్మెల్యే అయిన మాజీ పీసీసీ చీఫ్ భూపెన్ బోరా, రఖీబ్ హసన్ సారథ్యం తప్పుకుని కాంగ్రెస్‌ను వదిలి వెళ్లారు. సీఎం హిమంత బిశ్వ శర్మతో సమావేశమై బీజేపీలో చేరారు. ఇద్దరూ దిబ్రూగఢ్ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘ నేపథ్యంతో సత్సంబంధాలు పెంచుకున్నారు. తండ్రి తరుణ్ గొగోయ్‌తో విభేదాలు, పార్టీ విధానాల అసంతృప్తి కారణంగా బీజేపీ బలోపేతమైంది. ఉత్తర అస్సాంలో బలమైన హిందూ నాయకుడు దక్కడం బీజేపీకి పెద్ద లాభం. బిహార్‌లో అనవసర స్పందనలతో ఓటమి మూటగట్టుకున్న కాంగ్రెస్... అస్సాంలో స్పందించకుండా మరోసారి కోల్పోబోతోంది. రాహుల్ త్వరగా అక్కడ పరిజనీనంగా పరిస్థితులు సరిచేస్తే మాత్రమే పార్టీ బలపడే అవకాశం ఉంది. లేకపోతే ఈ డబుల్ ఎర్రర్ 2026 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మరింత దెబ్బ తీసే ప్రమాదం ఉంది.

# ఎక్సైజ్ సిబ్బందికి ఆయుధాలు

- అవసరమైన శిక్షణ ఇచ్చి ఆయుధాలను అప్పగిస్తాం
- డ్రగ్స్ రహిత తెలంగాణే సర్కార్ లక్ష్యం
- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**ముద్ర, హైదరాబాద్ :**



డ్రగ్స్, గంజాయి స్మగ్లర్ల ఆగడాలను అరికట్టడంతోపాటు అధికారుల ఆత్మరక్షణ కోసం ఎక్సైజ్ శాఖకు ఆయుధాలు ఇచ్చే అంశం ప్రస్తుతం ప్రభుత్వం పరిశీలనలో ఉందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి ఆయుధాలను అప్పగిస్తామని ప్రకటించారు. ఈ పోరాటంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అధికారుల వెంటే ఉంటుందని చెప్పారు. అవసరమైన వనరులు కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీ, క్యాలెండర్లను శుక్రవారం రవీంద్రభారతిలో మంత్రి ఆవిష్కరించి మాట్లాడారు. మాదకద్రవ్యాల మహమ్మారిని రాష్ట్ర సరిహద్దుల వరకు తరిమికొట్టడం ద్వారా తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. డ్రగ్స్ తో కలిగే సామాజిక అనర్థాలపై ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు కోరల్లో చిక్కి ఎంతోమంది యువత భవిష్యత్తు నాశనమవుతోందని, ఎన్నో కుటుంబాలు చితికిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తలిదండ్రుల ఆశలు అడియాశలవుతున్నాయన్నారు. ఇలాంటి అరాచక శక్తులను సమాజం నుంచి ఏరిపారేయాలని పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో ప్రాణాలను పణంగా పెట్టి గంజాయి ముఠా దాడిలో ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుల్ సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల కట్టడికి అధికారులు తమ శక్తివంచన లేకుండా కృషి చేయాలన్న మంత్రి అన్నారు. ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అదనపు కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషీ, ఎక్సైజ్ అకాడమీ డైరెక్టర్ సురేష్ రాథోడ్, జాయింట్ కమిషనర్ (ఎన్ఫోర్స్మెంట్) జి.అంజన్ రావు, డిప్యూటీ కమిషనర్ జె.హరికిషన్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సూర కృష్ణ, జనరల్ సెక్రటరీ చిరంజీవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రపంచ టెక్ మ్యాప్‌లో ఏపీ మార్క్ అమరావతి 'క్వాంటం వ్యాలీ'

- కృత్రిమ మేధస్సుపై గ్లోబల్ రౌండ్ టేబుల్‌లో ప్రసంగించిన సీఎం చంద్రబాబు
- సావరిన్ ఏఐతో ప్రజలకు లాభాలు
- డీప్ టెక్నాలజీ రంగంలో ఏపీ దూకుడు

**ముద్ర, ఢిల్లీ :**



ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో భాగంగా వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహించిన కృత్రిమ మేధస్సు ద్వారా పోటీతత్వం అంశంపై రౌండ్ టేబుల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం సీఈఓ బోర్కే బ్రెండే హాజరయ్యారు. సమావేశంలో కృత్రిమ మేధస్సు(ఏఐ) దేశాల అభివృద్ధికి కీలక శక్తిగా మారబోతుందని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

**- అమరావతి క్వాంటం వ్యాలీపై భారీ లక్ష్యాలు..**


సమీప భవిష్యత్‌లో అమరావతి క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచవ్యాప్తంగా చర్చించే స్థాయికి తీసుకెళ్లాలన్నదే తమ లక్ష్యమని సీఎం చంద్రబాబు తెలిపారు. గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థల రాకతో విశాఖపట్నం ఏఐ డేటా హబ్‌గా మారే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన పరికరాల తయారీకి అనుకూలంగా సమగ్ర క్వాంటం ఎకోసిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన వివరించారు.

**- సావరిన్ ఏఐతో ప్రజలకు లాభాలు..**

దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టాలన్న సంకల్పంతో ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని, దేశం ఆ లక్ష్యాన్ని సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పౌరులందరికీ ప్రయోజనం కలిగేలా సావరిన్ ఏఐ వినియోగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. కృత్రిమ మేధస్సు అద్భుతాలను సాధించే సామర్థ్యం కలిగి ఉందని ఆయన అన్నారు.

**- డీప్ టెక్నాలజీ రంగంలో ఏపీ దూకుడు..**

డీప్ టెక్నాలజీ రంగంలో మరింత ముందుకు వెళ్లేలా ఆంధ్రప్రదేశ్ ప్రణాళికలు రూపొందిస్తోందని సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడ్‌టెక్ పార్క్‌ల వంటి ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ఇప్పటికే ఉన్నాయని వెల్లడించారు. ఈ రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ, సమగ్ర క్వాంటం ఎకోసిస్టంను తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆయన వివరించారు.



## టోల్‌ప్లాజాల్లో క్యాష్‌కు గుడ్‌బై...

- ఏప్రిల్ 1 నుంచి నగదు చెల్లింపులు రద్దు
- అన్ని రాష్ట్రాలకు కేంద్ర రవాణా శాఖ ఆదేశాలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

కేంద్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. టోల్‌ప్లాజాల్లో నగదు చెల్లింపులు నిలిపివేసింది. ఇక నుంచి అన్నీ డిజిటల్ పేమెంట్సే ఉండాలని ఆదేశించింది. వచ్చే ఏప్రిల్ ఒకటో తేది నుంచి దీనిని పక్కాగా అమలు చేయాలని కేంద్ర రవాణా శాఖ ఆదేశాలు జారీ చేసింది. టోల్‌ప్లాజాల వద్ద రద్దీని తగ్గించడం, ప్రయాణ సమయాన్ని ఆదాచేయడం, రుసుముల వసూళ్లలో పారదర్శకత కోసం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు ఫాస్టాగ్ ద్వారా టోల్‌ప్లాజా నుంచి వాహనాలు వెళ్తున్నప్పటికీ కొన్ని వాహనాలు అప్పటికప్పుడు నగదు చెల్లించి వెళ్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పూర్తిస్థాయిలో నగదు రహిత చెల్లింపులతోనే టోల్‌ప్లాజాలు నడవనున్నాయి. గడువు సమీపిస్తుండటంతో డిజిటల్ చెల్లింపులకు మారేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని వాహనదారులకు అధికారులు సలహాలు ఇస్తున్నారు. ఫాస్టాగ్ లేదా యూపీఐ చెల్లింపుల విధానం వల్ల ప్రయాణాలు వేగవంతమవుతాయి, ఇంధనం ఆదా అవుతుంది. పారదర్శకత వస్తుంది. చిల్లర లేదా రశీదుల కోసం వేచి ఉండవలసిన అవసరం ఉండదని చెబుతున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
21.02.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



దేశంలో టాప్ 10 మోటార్ సైకిళ్లు
KTM Duke 200
హై పెర్ఫార్మెన్స్, స్పోర్ట్స్ రైడింగ్‌కు బెస్ట్.
స్టైలిష్ డిజైన్, ప్రీమియం ఫీల్.



## టీమిండియాకు స్పిన్ గండం

- సూపర్ 8లో ప్రత్యర్థి జట్ల వ్యూహం
- మెన్ ఇన్ బ్లూకు అగ్నిపరీక్ష!
- లీగ్ దశలో బయటపడిన బ్యాటింగ్ పొరపాట్లు
- ప్రతి మ్యాచ్ భారత్ కు కఠినమే



**టీ20 ప్రపంచకప్‌లో లీగ్ దశను విజయవంతంగా దాటిన టీమిండియాకు అసలైన సవాల్ ఇప్పుడు మొదలైంది. సూపర్-8 పోరుకు సర్వం సిద్ధమైన వేళ, భారత బ్యాటింగ్ లైనప్‌ను 'స్పిన్' భయం వెంటాడుతోంది. లీగ్ మ్యాచ్‌ల్లో పసికూనలపై గెలిచినా, నాణ్యమైన స్పిన్నర్లు ఉన్న జట్లపై మన బ్యాటర్లు తడబడటం ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది.**

**వ్యూహాలకు పదును పెడుతున్న ప్రత్యర్థులు**

సూపర్ 8లో భారత్‌తో తలపడబోయే జట్లు టీమిండియా బలహీనతను పసిగట్టాయి. ముఖ్యంగా మిడిల్ ఓవర్లలో స్పిన్నర్లను ఎదుర్కోవడంలో మన టాప్ ఆర్డర్ తడబడుతుండటాన్ని ప్రత్యర్థులు తమకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తున్నారు. టర్న్ అయ్యే పిచ్‌లపై భారత బ్యాటర్లు డిఫెన్సివ్‌గా ఆడుతుండటంతో, డాట్ బాల్స్ సంఖ్య పెరిగి ఒత్తిడి పెరుగుతోంది.

**లీగ్ దశలో బయటపడిన లోపాలు**

లీగ్ దశలో పటిష్టమైన బ్యాటింగ్ లైనప్ అనిపించుకున్నా, కొన్ని చేదు నిజాలు బయటపడ్డాయి. స్పిన్ బౌలింగ్‌లో పరుగులు తీయడానికి సీనియర్లతో పాటు యువ ఆటగాళ్లు కూడా ఇబ్బంది పడ్డారు. పవర్‌ప్లేలోనే కీలక వికెట్లు కోల్పోవడం వల్ల మిడిల్ ఆర్డర్‌పై భారం పడుతోంది. స్పిన్‌ను ఎదుర్కోవడంలో కీలకమైన స్వీప్, రివర్స్ స్వీప్ షాట్లను ఆడటంలో మన వారు విఫలమవుతున్నారు.

**ప్రతి మ్యాచ్ ఒక సవాలే!**

సూపర్ 8లో తలపడే జట్లన్నీ సమతూకంతో ఉన్నాయి. ఇక్కడ జరిగే ప్రతి మ్యాచ్ సెమీస్ అవకాశాలను శాసిస్తుంది. చిన్న పొరపాటు చేసినా టోర్నీ నుంచి నిష్క్రమించే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో కోచ్, కెప్టెన్ స్పిన్ అస్త్రాన్ని తిప్పికొట్టేందుకు ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నారు."టర్నింగ్ ట్రాక్‌స్‌పై భారత బ్యాటర్లు తమ ఫుట్ వర్క్‌ను మెరుగుపరుచుకోవాలి. లేదంటే సూపర్ 8లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు." అని క్రీడా విశ్లేషకులు విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.



## సెంట్రల్ కాంట్రాక్టుల్లో పెద్ద మార్పులు

భారత్‌లో నిర్వహించనున్న టీ20 ప్రపంచ కప్‌కు ఆడబోమని ప్రకటించి అంతర్జాతీయ వేదికపై చర్చకు దారి తీసిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఇప్పుడు అంతర్గతంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. టీమ్ నిర్మాణంలో కొత్త దిశగా అడుగులు వేస్తూ సీనియర్ ఆటగాళ్లకు షాక్ ఇచ్చింది. వార్షిక సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలో యువ ఆటగాళ్లకు ప్రాధాన్యం పెంచి, కొంతమంది వెటరన్లను తక్కువ గ్రేడ్‌లకు మార్చడం ద్వారా భవిష్యత్‌పై దృష్టి సారించింది.ఈ ఏడాది కాంట్రాక్టుల్లో ఏ ప్లస్ విభాగాన్ని పూర్తిగా రద్దు చేస్తూ, గ్రేడ్ ఏనే అత్యున్నతంగా నిర్ణయించింది. ఈ మార్పుతో ఇంతకుముందు టాప్ కేటగిరీలో ఉన్న పలువురు ఆటగాళ్లు గ్రేడ్ ఏకు చేరారు. మాజీ కెప్టెన్ నజ్ముల్ హుసేన్ శాంటో, పేసర్ తస్కిన్ అహ్మద్‌లను గ్రేడ్ ఏలో చేర్చగా, ప్రస్తుత కెప్టెన్ లిటన్ దాస్, ఆల్‌రౌండర్ మెహిదీ హసన్ మిరాజ్ కూడా అదే జాబితాలో కొనసాగుతున్నారు. అయితే సుదీర్ఘకాలంగా జట్టుకు సేవలందిస్తున్న ముష్ఫికర్ రహీంను గ్రేడ్ బీకి కేటాయించడం ఆశ్చర్యం కలిగించింది. గ్రేడ్ ఏలో ఉన్న ఆటగాళ్లకు నెలకు సుమారు రూ.5.9 లక్షలు అందనున్నాయి. గతంలో ఉన్న ఏ ప్లస్ కేటగిరీ రద్దుతో తస్కిన్ అహ్మద్ వేతనం తగ్గింది. ఇదివరకూ అతను సుమారు రూ.7 లక్షలు పొందగా, తాజా నిర్మాణంలో అది తగ్గింది. బోర్డు వర్గాల సమాచారం ప్రకారం, ఈ నిర్ణయాలు పూర్తిగా ప్రదర్శన, ఫిట్‌నెస్ మరియు భవిష్యత్ ప్రణాళికలను దృష్టిలో ఉంచుకొని తీసుకున్నవేనని చెబుతున్నారు. ఇటీవల ఆసియా కప్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన షద్మాన్ ఇస్లాం, తంజిద్ హసన్, రిషద్ హొసేన్, మహేది హసన్‌లకు ప్రమోషన్ లభించింది. వీరంతా గ్రేడ్ సీ నుంచి గ్రేడ్ బీకి ఎగబాకారు. గ్రేడ్ బీలో ఉన్న ఆటగాళ్లకు నెలకు సుమారు రూ.4.4 లక్షలు చెల్లించనున్నారు. గ్రేడ్ సీ, డీ కేటగిరీల్లో ఉన్నవారికి కూడా గతంతో పోలిస్తే ఆదాయం పెరిగే అవకాశముంది.

**సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితా (2026)**

గ్రేడ్ ఏ: నజ్ముల్ హుసేన్ శాంటో, మెహిదీ హసన్ మిరాజ్, లిటన్ దాస్, తస్కిన్ అహ్మద్
గ్రేడ్ బీ: ముష్ఫికర్ రహీం, మొమినుల్ హక్, తైజుల్ ఇస్లాం, ముస్తాఫిజుర్ రెహ్మాన్, తౌహిద్ హృదోయ్, షద్మాన్ ఇస్లాం, తంజిద్ హసన్, రిషద్ హొసేన్, మహేది హసన్, హసన్ మహమూద్, నహిద్ రానా
గ్రేడ్ సీ: సౌమ్యా సర్కార్, జకీర్ అలీ, షొరిఫుల్ ఇస్లాం, తంజిమ్ హసన్, నసుమ్ అహ్మద్, ఖలెద్ అహ్మద్
గ్రేడ్ డీ: సైఫ్ హసన్, పర్వేజ్ హొసేన్, తన్వీర్ ఇస్లాం, నయీం హసన్, హసన్ మురాద్, షమీం హొసేన్, నురుల్ హసన్

ఇదిలా ఉండగా, భారత్‌లో జరిగే టీ20 ప్రపంచకప్ నుంచి తప్పుకోవడంతో బంగ్లాదేశ్ జట్టు విమర్శలు ఎదుర్కొంది. భద్రతా కారణాలను చూపుతూ పాకిస్థాన్ బోర్డు మద్దతుతో భారత్‌లో ఆడబోమని పట్టుబట్టడంతో అంతర్జాతీయ క్రికెట్ మండలి అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆ స్థానాన్ని ర్యాంకింగ్స్ ఆధారంగా స్కాట్లాండ్‌కు కేటాయించారు. ప్రపంచకప్‌లో అవకాశం కోల్పోయిన బంగ్లాదేశ్ ఇప్పుడు మార్చిలో పాకిస్థాన్‌తో స్వదేశంలో సిరీస్‌కు సిద్ధమవుతోంది. ఆ సిరీస్‌లో గట్టి ప్రదర్శనతో విమర్శలకు సమాధానం చెప్పాలని బంగ్లా ఆటగాళ్లు సంకల్పంతో ఉన్నారు.



## రాహుల్ చాహర్ విడాకులు
### భావోద్వేగ ప్రకటన

ఇటీవలి కాలంలో టీమిండియా క్రికెటర్లలో విడాకుల వార్తలు పెరుగుతున్నాయి. శిఖర్ ధవన్, మహ్మద్ షమీ, యుజ్వేంద్ర చహల్, హార్దిక్ పాండ్యా తర్వాత తాజాగా మరో పేరు చేరింది. 26 ఏళ్ల లెగ్‌స్పిన్నర్, దీపక్ చాహర్ సోదరుడు అయిన రాహుల్ చాహర్ తన భార్య ఇషానీ జోహర్‌తో విడిపోయినట్లు ప్రకటించాడు. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో భావోద్వేగ సందేశంతో వెల్లడించాడు. చిన్న వయసులో పెళ్లి చేసుకున్నానని, అప్పట్లో తనను తాను పూర్తిగా అర్థం చేసుకోలేకపోయానని రాహుల్ పేర్కొన్నాడు. గత 15 నెలలు కోర్టు ప్రక్రియలతో గడిచాయని, ఈ అనుభవం తనకు సహనం, ధైర్యం నేర్పిందని చెప్పాడు. ఇకపై కొత్త జీవితం ప్రారంభిస్తానని తెలిపాడు.

**ప్రేమ నుంచి విడాకుల వరకు**
**2019 డిసెంబర్‌లో నిశ్చితార్థం**
**2022 మార్చిలో గోవాలో వివాహం**
**ఇషానీ ఫ్యాషన్ డిజైనర్‌గా పనిచేసేది**
**సోషల్ మీడియాలో వీరి జంటకు మంచి ఆదరణ**

విడాకుల అనంతరం రాహుల్ క్రికెట్‌పై దృష్టి పెట్టనున్నాడు. ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అతని ప్రదర్శన నిరాశపరిచింది. 2026 ఐపీఎల్ వేలంలో చెన్నై సూపర్ కింగ్స్ రూ.5.2 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ సీజన్‌లో మెరుగైన ఆటతో మళ్లీ జాతీయ జట్టులోకి రావాలని రాహుల్ లక్ష్యంగా పెట్టుకున్నాడు.

## ట్రాట్ హయాంలో ఆఫ్ఘన్ జట్టులో సంచలన మార్పు

జోనాథన్ ట్రాట్ 2022లో ఆఫ్ఘనిస్తాన్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి జట్టుకు కొత్త ఊపిరి పోశాడు. ఒకప్పుడు అనామకంగా కనిపించిన అఫ్ఘన్ టీమ్‌ను అతను క్రమశిక్షణ, వ్యూహం, మానసిక దృఢత్వంతో గట్టి పోటీదారుగా మలిచాడు. అంతర్జాతీయ వేదికలపై స్టార్ ఆటగాళ్లను ఇబ్బంది పెట్టే స్థాయికి బౌలింగ్ దళాన్ని తీర్చిదిద్దాడు. ఆరంభంలో ఐర్లాండ్ చేతిలో సిరీస్ ఓటమి ఎదురైనా, 2022 ఆసియా కప్‌లో శ్రీలంక, బంగ్లాదేశ్‌లపై సంచలన విజయాలు సాధించి జట్టు శక్తిని చాటింది. 2023లో ఇంగ్లండ్‌పై చారిత్రక గెలుపు, పాకిస్తాన్‌పై టీ20 సిరీస్ విజయం ఆఫ్ఘన్ ఎదుగుదలకు మైలురాళ్లుగా నిలిచాయి. 2024 టీ20 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాను ఓడించి సెమీఫైనల్ చేరడం జట్టు చరిత్రలో ప్రత్యేక ఘట్టం. సౌతాఫ్రికాతో జరిగిన ఉత్కంఠభరిత డబుల్ సూపర్ ఓవర్ మ్యాచ్ వారి పోరాటస్ఫూర్తిని ప్రపంచానికి చూపించింది. తాజా ప్రపంచకప్ గ్రూప్ దశ ముగిసిన తర్వాత ట్రాట్ తన పదవికి వీడ్కోలు పలికాడు. భావోద్వేగంతో జట్టును వీడిన అతను, ఈ ప్రయాణం ఎన్నో మధుర జ్ఞాపకాలు మిగిల్చిందని పేర్కొన్నాడు. మూడు సంవత్సరాల్లో ఆఫ్ఘనిస్తాన్‌ను 'చిన్న జట్టు' నుంచి 'ఎవరినైనా ఓడించే జట్టు'గా మార్చిన కోచ్‌గా ట్రాట్ పేరు నిలిచిపోతుంది





## ఆసియా కప్ రైజింగ్ స్టార్స్‌లో భారత్ ఎ ఫైనల్‌కు

బ్యాంకాక్ వేదికగా జరుగుతున్న మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో భారత్ 'ఏ' జట్టు టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. సెమీఫైనల్లో శ్రీలంకపై ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ముందుగా బ్యాటింగ్ చేసిన లంక జట్టును భారత బౌలర్లు 118 పరుగులకే కట్టడి చేశారు. కెప్టెన్ రాధా యాదవ్ అద్భుత బౌలింగ్‌తో 4 వికెట్లు తీసి ప్రత్యర్థి మిడిలార్డర్‌ను కూల్చేశారు. తనూజ కన్వర్ కీలక బ్రేక్ ఇవ్వగా, శశిని గుహ్మని (22) తప్ప మరెవ్వరూ నిలవలేకపోయారు. 119 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు వృందా దినేశ్ (42) దూకుడైన ఆరంభం అందించింది. ఆ తర్వాత రాధా యాదవ్ (31 నాటౌట్) సమయోచిత ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయ తీరాలకు చేర్చింది. ఈ విజయంతో భారత్ ఏ జట్టు ఫైనల్లో బంగ్లాదేశ్‌ను ఢీకొట్టనుంది.

## టీమిండియాపై ఆమిర్ అక్కసు..



- **సెమీస్ అవకాశాలపై విమర్శలు**

టీ20 ప్రపంచకప్2026 నేపథ్యంలో పాకిస్తాన్ మాజీ పేసర్ మొహమ్మద్ ఆమిర్ మరోసారి టీమిండియాపై అక్కసు వెళ్లగక్కాడు. భారత్ సెమీఫైనల్‌కు చేరే అవకాశాలే లేవని వ్యాఖ్యానిస్తూ చర్చకు దారి తీశాడు. గ్రూప్ దశలో భారత్ అజేయంగా సూపర్8కు చేరగా, పాకిస్తాన్ మాత్రం ఎలాగోలా ముందడుగు వేసింది. అంతేకాదు, వరల్డ్‌కప్‌ల్లో పాక్‌పై భారత్ ఆధిపత్యం 81కు పెరగడం కూడా ఆమిర్ వ్యాఖ్యల నేపథ్యంలో ప్రస్తావనీయమైంది. అయినప్పటికీ, భారత్ బ్యాటింగ్ లైనప్ స్థిరంగా లేదని, సౌతాఫ్రికా, వెస్టిండీస్ జట్లే సెమీస్‌కు బలమైన అభ్యర్థులని ఆమిర్ పేర్కొన్నాడు. ఈ వ్యాఖ్యలు భారత అభిమానులను ఆగ్రహానికి గురిచేశాయి. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలో ఉన్న జట్టును తక్కువ అంచనా వేయడం సరైంది కాదని, ముందు పాకిస్తాన్ జట్టు ప్రదర్శనపై దృష్టి పెట్టాలని సోషల్ మీడియాలో కౌంటర్లు ఇస్తున్నారు.సూపర్8 పోటీలు ముదురుతున్న వేళ ఆమిర్ వ్యాఖ్యలు మరోసారి ఇండోపాక్ క్రికెట్ వేడిని పెంచాయి

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
21.02.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews






## ధనుష్‌తో ఏమీ లేదంటూనే ప్రశంసలతో ముంచెత్తిన మృణాల్

తమిళ స్టార్ ధనుష్తో తనకు ఎలాంటి ప్రేమ సంబంధం లేదని స్పష్టం చేసిన బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్, అదే సమయంలో ఆయనపై ప్రశంసల వర్షం కురిపించడం చర్చకు దారితీసింది. ఇటీవల వెలువడిన పెళ్లి ప్రచారాలను ఖండించిన ఆమె, అవన్నీ ఆధారంలేని వార్తలేనని తేల్చి చెప్పింది. అయితే నటుడిగా ధనుష్‌పై తనకు అపారమైన గౌరవం ఉందని మృణాల్ వెల్లడించింది. ఆయనను కేవలం గొప్ప నటుడిగానే కాకుండా సింగర్, డ్యాన్సర్, దర్శకుడిగా కూడా ప్రశంసించింది. అసురన్ వంటి సినిమాలు తనను ఎంతో ప్రభావితం చేశాయని చెప్పింది. రిలేషన్‌షిప్ వార్తలను ఖండించినప్పటికీ, ధనుష్‌ను మంచి స్నేహితుడిగా భావిస్తున్నానని మృణాల్ పేర్కొనడం ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది.





## మరో బాలీవుడ్ మూవీలో రష్మిక.. బీ టౌన్ లో చర్చలు

వరుస విజయాలతో దూసుకెళ్తున్న రష్మిక మందన్న మరో ఆసక్తికర బాలీవుడ్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. కాక్‌టెయిల్ 2లో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. షాహిద్ కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా, కృతి సనన్ మరో ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాలో రష్మిక, కృతి పాత్రలపై సోషల్ మీడియాలో వినిపిస్తున్న వార్తలు చర్చనీయాంశంగా మారాయి. బాలీవుడ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రంలో కృతి-రష్మిక పాత్రలు ప్రత్యేక కోణంలో మలచబడినట్టు టాక్. ఇద్దరూ స్వలింగ ప్రేమికులుగా కనిపించే అవకాశముందనే ప్రచారం సాగుతోంది. ట్రయాంగిల్ లవ్ స్టోరీ నేపథ్యంతో కథ నడుస్తుందని అంటున్నారు. అయితే ఈ విషయాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. దర్శకుడు హోమీ అదజానియా తెరకెక్కిస్తున్న ఈ చిత్రం షూటింగ్ జనవరి 31న పూర్తయినట్లు సమాచారం. ఇది 2012లో విడుదలైన కాక్‌టెయిల్కు సీక్వెల్‌గా వస్తోంది. త్వరలోనే విడుదల తేదీ ప్రకటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. షాహిద్ కపూర్ ఇప్పటివరకు చూడని పాత్రలో కనిపించనున్నాడనే ఆసక్తి కూడా సినిమాపై అంచనాలు పెంచుతోంది.



## కపుల్ ఫ్రెండ్లీ ప్రమోషన్స్‌లో పూరీ డైలాగులు...

### ప్రభాస్ ,సంతోష్ శోభన్ ఓపెన్

కపుల్ ఫ్రెండ్లీ ప్రమోషన్స్ సందర్భంగా టాలీవుడ్ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ దర్శకుడు పూరీ జగన్నాథ్ గురించి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. యూవీ కాన్సెప్ట్ బ్యానర్ టీమ్‌తో ముచ్చటిస్తుండగా హీరో సంతోష్ శోభన్, ఏక్ నిరంజన్ తనకు ఫేవరెట్ మూవీ అని చెప్పాడు. దీనికి స్పందించిన ప్రభాస్, ఆ సినిమా, పూరీ స్టైల్‌పై తన అభిమానం వ్యక్తం చేశారు. పూరీ రాసే పాత్రల్లో ప్రత్యేకమైన యాటిట్యూడ్, ఎనర్జీ ఉంటాయని ప్రభాస్ అన్నారు. ముఖ్యంగా బుజ్జిగాడు కథ విన్న వెంటనే ఆ క్యారెక్టర్ తనను ఆకట్టుకుందని, ఆ సమయంలో తెలియకుండానే అదే పాత్ర గురించి ఎక్కువగా మాట్లాడేవాడినని గుర్తుచేసుకున్నారు. ఏక్ నిరంజన్‌లోని కొన్ని డైలాగులు ఇప్పటికీ తనకు గుర్తుండి ఇష్టంగా ఉంటాయని వెల్లడించారు.పూరీ జగన్నాథ్ టాలెంట్‌పై నమ్మకం వ్యక్తం చేసిన ప్రభాస్, సరైన కథతో ఆయన మళ్లీ పెద్ద హిట్ ఇవ్వగలరని అన్నారు. ఒకప్పుడు పూరీ సినిమాలకు ఉన్న మాస్ క్రేజ్ ప్రత్యేకమని చెప్పిన ప్రభాస్, భవిష్యత్తులో మరోసారి కలిసి పనిచేసే అవకాశం వస్తే ఆనందంగా ఉంటుందని సంకేతం ఇచ్చారు.




## 19 ఏళ్ల తర్వాత భారత్‌లో షకీరా లైవ్ షో...

### ముంబై, ఢిల్లీలో మెగా కచేరీలు

ప్రపంచ పాప్ సంగీత రంగంలో తనదైన ముద్ర వేసుకున్న కొలంబియన్ స్టార్ షకీరా మళ్లీ భారత్‌కి రానున్నారు. దాదాపు 19 సంవత్సరాల తర్వాత ఆమె భారత అభిమానులను ప్రత్యక్షంగా అలరించబోతుండటం విశేషం. 2007లో ముంబైలో ఆమె ఇచ్చిన తొలి లైవ్ కాన్సర్ట్ ఇప్పటికీ అభిమానుల జ్ఞాపకాల్లో నిలిచిపోయింది.ప్రస్తుతం షకీరా తన కొత్త ఆల్బమ్ "లాస్ ముజెరెస్ యా నో లోరన్ వరల్డ్ టూర్" ద్వారా ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శనలు ఇస్తోంది. ఈ టూర్‌లో భాగంగా ఏప్రిల్ 10న ముంబై మహాలక్ష్మి రేస్‌కోర్స్‌లో, ఏప్రిల్ 15న ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆమె లైవ్ షోలు జరగనున్నాయి. టికెట్లు డిస్ట్రిక్ యాప్ ద్వారా అందుబాటులోకి రానున్నాయి. ఫుట్‌బాల్ అభిమానులకు మాత్రం షకీరా పేరు వినగానే వాక్కా వాక్కా దిస్ టైమ్ ఫర్ ఆఫ్రికా' గుర్తుకొస్తుంది. 2010 ఫిఫా వరల్డ్ కప్ సందర్భంగా విడుదలైన ఈ పాట ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇప్పుడు అదే ఎనర్జీతో భారత వేదికపై షకీరా మెరుపులు చూపించేందుకు సిద్ధమవుతోంది.

## రణ్‌వీర్ సింగ్‌కు మళ్లీ బెదిరింపులు...

**10 కోట్లు డిమాండ్ చేసిన బిష్ణోయ్ గ్యాంగ్?**



బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్కు బెదిరింపులు వచ్చినట్టు సమాచారం. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో రూ.10 కోట్లు ఇవ్వాలంటూ డిమాండ్ చేసిన వాయిస్ నోట్ ఒక అమెరికా రిజిస్టర్డ్ ఫోన్ నంబర్ నుంచి వచ్చినట్టు మీడియా కథనాలు చెబుతున్నాయి. ఈ ఘటన సినీ వర్గాల్లో కలకలం రేపింది.విషయం వెలుగులోకి రాగానే ముంబై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. క్రైమ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. కాల్ డేటా రికార్డులు, డిజిటల్ ఆధారాలు పరిశీలిస్తూ నంబర్ మూలాన్ని గుర్తించేందుకు అమెరికా భద్రతా సంస్థలతో కూడా సంప్రదింపులు కొనసాగిస్తున్నట్టు తెలుస్తోంది. ముందస్తు జాగ్రత్తగా రణ్‌వీర్ సింగ్‌కు భద్రత పెంచే చర్యలు తీసుకుంటున్నారు. గతంలో కూడా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పలువురు ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులు చేసిన ఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ బెదిరింపుల వెనుక నిజమెంత అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## అల్లు అర్జున్‌కు బిగ్ రిలీఫ్



అల్లు అర్జున్‌కు సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో తాత్కాలిక ఊరట లభించింది. సంధ్య థియేటర్ వద్ద పుష్ప 2 విడుదల సందర్భంగా జరిగిన ఘటనపై పోలీసులు దాఖలు చేసిన అభియోగ పత్రాన్ని నాంపల్లి కోర్టు మరోసారి తిరస్కరించింది. కీలక సాక్ష్యాలు లేకపోవడం, సాంకేతిక లోపాలు ఉండడం కారణంగా పత్రాలను తిరిగి పంపినట్లు సమాచారం. కోర్టు పరిశీలనలో భాగంగా డిజిటల్ ఆధారాలు, పూర్తి వివరాలు జత చేయలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. కేసులో మొత్తం 23 మందిపై అభియోగాలు నమోదు చేసినప్పటికీ, వాటిని బలపరిచే పక్కా సాక్ష్యాలు సమర్పించలేకపోవడం దర్యాప్తు లోపాలను బయటపెట్టిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పోలీసుల పని తీరు ప్రశ్నార్థకంగా మారింది. ఇక ఈ ఘటనలో గాయపడిన శ్రీతేజ్ ఆరోగ్యం ఇంకా ఆందోళనకరంగానే ఉందని సమాచారం. సహాయంపై కూడా వివాదాలు కొనసాగుతున్నాయి. మరోవైపు అల్లు అర్జున్‌ను ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేస్తున్నారని అభిమానులు ఆరోపిస్తున్నారు. ఈ కేసుకు రాజకీయ కోణం ఉందా అనే చర్చలు కూడా సోషల్ మీడియాలో జోరుగా సాగుతున్నాయి. పోలీసులు లోపాలను సరిదిద్దుకుని మళ్లీ అభియోగ పత్రం దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది.

## ‘టాక్సిక్’ టీజర్‌లో డబుల్ షాక్

### డార్క్ మాఫియా ప్రపంచం తెరపైకి

యష్ హీరోగా నటిస్తున్న ‘టాక్సిక్’ టీజర్ విడుదలై భారీ చర్చకు దారితీసింది. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం దశాబ్దాల నాటి మాఫియా నేపథ్యంతో సాగుతుంది. సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్ లేని కాలంలో నేర సామ్రాజ్యాన్ని నిర్మించిన డాన్ పాత్రలో యష్ కనిపిస్తాడు. టీజర్‌లో యష్ రెండు భిన్న గెటప్స్‌లో దర్శనమివ్వడం ఆసక్తి రేపుతోంది. ఒకవైపు కిరాతక డాన్‌గా, మరోవైపు అతనికి పోలికలున్న యువకుడిగా కనిపించడం కథలో పెద్ద ట్విస్ట్ ఉన్నట్టు సంకేతాలు ఇస్తోంది. భారీ యాక్షన్ సన్నివేశాలు, డార్క్ టోన్, హై వయోలెన్స్ టీజర్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. టాక్సిక్ బిగ్ స్క్రీన్ ఎక్స్‌పీరియన్స్‌ను లక్ష్యంగా పెట్టుకుని రూపొందిన ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా మార్చి 19న థియేటర్లలో విడుదల కానుంది. ట్రైలర్‌లో ఇంకెన్ని సంచలనాలు ఉంటాయోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు




Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com